ప్రజాశక్తి
గురువారం 9 జనవరి 2025
8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

బిజెపిలో కుల వివక్ష !

- దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాక్షిగా దళిత కార్యకర్తలపై కుల దూషణలు
- ఆగ్రహంతో పార్టీ బందరు ఇన్చార్జి బాలాజీకి కార్యకర్తల దేహశుద్ధి
- సోషల్ మీడియాలో వీడియోలు హల్‌చల్

గూడూరు : బిజెపిలోని కొందరు అగ్రకుల నేతలు ఆ పార్టీలోని దళిత కార్యకర్తలను వివక్షతకు గురిచేయడం బహిర్గతమైంది. పార్టీకి చెందిన దళిత కార్యకర్తలను బిజెపి బందరు నగర ఇన్‌చార్జి సోడిశెట్టి బాలాజీ అనుచరులు కులం పేరుతో దూషించారని దళిత కార్యకర్తలు ఆరోపించడం తీవ్ర దుమారాన్ని రేపింది. దళిత కార్యకర్తలు తీవ్ర ఆగ్రహంతో బాలాజీకి దేహశుద్ధి చేసిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. బిజెపి దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాట్రగడ్డ రాజశేఖర్ సాక్షిగా జరిగిన కుల దూషణలపై నాలుగు రోజులుగా పార్టీ అధిష్టానం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై దళిత కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క కూటమి ప్రభుత్వంలోని టిడిపి, జనసేన నేతల్లోనూ ఈ ఘటన కలవరం రేపుతోంది.

బందరు జిల్లా కోర్టు సమీపంలోని ఓ కన్వెన్షన్ హాలులో శనివారం బిజెపి జిల్లాస్థాయి కమిటీల నూతన కార్యవర్గ ఎన్నిక సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్ష పదవికి బందరుకు చెందిన సోడిశెట్టి బాలాజీ, పంతం గజేంద్రరావు నామినేషన్ వేశారు. ఇతర ప్రాంతాలకు చెందిన నేతలు నామినేషన్‌లు వేశారు. అధ్యక్ష పదవికి ఓటున్న కార్యకర్తల నుంచి సంతకాలు సేకరించే క్రమంలో పార్టీలోని బాలాజీ అనుచరులు బాలాజీ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఈ దశలో ప్రతిగా దళిత కులాలకు చెందిన కార్యకర్తలు జై శ్రీరాం అంటూ నినాదాలు చేశారు. దీన్ని జీర్ణించుకోలేని బాలాజీ అనుచరులు కులాల పేరుతో దళితులను కులం పేరుతో దూషించారు. దీన్ని దళిత కార్యకర్తలు,ఆ పార్టీ దళిత మోర్చా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ జీర్ణించుకోలేకపోయారు. వెంట తీసుకు వచ్చిన అనుచరులతో కులం పేరుతో తిట్టిస్తావా అంటూ బాలాజీని వేదికపై నిలదీశారు. వివక్షత కారణంగానే దళితులు పార్టీలోకి రావడానికి (మిగతా 2లో)

విజయవాడ అభివృద్ధికి చర్యలు

- వివిధ పన్నుల రూపంలో రూ.160 కోట్లు వసూలు
- మేయర్ రాయన భాగ్యలక్ష్మీ

ప్రజాశక్తి-విజయవాడ: నగర సమగ్రాభివృద్ధికి గడిచిన ఏడాది కాలంలో ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో అనేక చర్యలు తీసుకోవడం జరిగిందని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మీ అన్నారు. విఎంసిలోని తన చాంబర్‌లో బుదవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నగర ప్రజలకు నూతన సంవత్సర, సంక్రాంతి శు భాకాంక్షలు తెలిపిన మేయర్, నగరపాలక సంస్థలోని వివిధ శాఖల పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు వివిధ దశల్లో ఉన్నాయని అన్నారు. ప్రభుత్వ సహకారం, నగర పరిధిలోని ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్ల తోడ్పాటు, నగర కమిషనర్, అధికారులు, ఉద్యోగుల కృషి కారణంగా విజయవాడ అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజారోగ్య విభాగం, ఇంజినీరింగ్, రెవెన్యూ, పట్టణ ప్రణాళికా విభాగం, అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ విభాగం, పరిపాలనా విభాగం, ఎస్టేట్, ఉద్యానవన శాఖ తదితర శాఖలు సమన్వయంతో నగర ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి, పథకాల అమలుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పాలనా పరమైన అంశాల్లో ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నగర కమిషనర్ అన్ని శాఖల అధికారులను, ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రత్యేక పండుగ సీజన్లలో రోజువారీ కార్మికులను (మిగతా 2లో)

గుంటుపల్లిలో రెవెన్యూ సదస్సు తీరును పరిశీలిస్తున్న ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- 33 రోజుల రెవెన్యూ సదస్సుల ద్వారా 4,813 అర్జీలు
- భూ హక్కుకు భరోసా కల్పించేలా శాశ్వత పరిష్కారం
- ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం

రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా 33 రోజుల పాటు రెవెన్యూ సదస్సులు జరిగాయని, మొత్తం 4,813 పిటిషన్లు వచ్చాయని, ప్రతి అర్జీపైనా ప్రత్యేక దృష్టి పెట్టి ఇప్పటికే 1,819 అర్జీలను పరిష్కరించామని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ తెలిపారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద చివరి రోజు జరిగిన గూడూరుపాడు రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్‌ఎస్) స్టాల్ కార్యకలాపాలను, ప్రభుత్వ భూముల రిజిస్టర్, రెవెన్యూ సదస్సుల మినిట్స్ రిజిస్టర్, ఎండోమెంట్ భూములు, అసైన్‌మెంట్ భూములు తదితర వివరాలను, గ్రామస్తులు అందించిన పిటిషన్ల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ హక్కుకు భరోసా కల్పిస్తూ భూ సమస్యలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించడం జరుగుతోందన్నారు. భూ సమస్యలపై బాధితులు ప్రభుత్వం చుట్టూ తిరగడం కాదని, ప్రభుత్వమే ప్రజల వద్దకు వెళ్లి సమస్య పరిష్కరించాలనే ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సదస్సులను విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎస్-ఎల్‌ఏలోగా సమస్యలను పరిష్కరిస్తున్నామని, అదేవిధంగా కుటుంబ తగాదాలతో కొన్ని, మరికొన్ని కోర్టుల పరిధిలో ఉన్నాయని వివరించారు. కొన్ని సమస్యలు తక్షణమే పరిష్కారం కాకపోయినా ప్రత్యేక ప్రణాళికతో వాటి పరిష్కారానికి కృషి (మిగతా 2లో)

మెట్లపల్లిలో రాత్రిళ్లు బయట తిరగొద్దు

- కృష్ణాజిల్లా డిఎఫ్ఒ సునీత
- పులి సంచారంపై అధికారుల పరిశీలన

అటవీ ప్రాంతంలో పరిశీలిస్తున్న కృష్ణాజిల్లా అటవీశాఖ అధికారిణి సునీత

ప్రజాశక్తి-గన్నవరం: మెట్లపల్లి అటవీ ప్రాంతం, గ్రామంలో రాత్రిళ్లు ఎవ్వరూ బయట ఒంటరిగా తిరగొద్దని కృష్ణాజిల్లా అటవీ శాఖ అధికారిణి పి.సునీత హెచ్చరించారు. మెట్లపల్లి ఏరియాలో పులి, పిల్లలు తిరుగుతున్నాయని ఆర్‌టిసి కండక్టర్ చెప్పిన నేపథ్యంలో బుధవారం అటవీ శాఖ అధికారులు విస్తృతంగా పర్యటించారు. పులి తిరిగిన ఆనవాళ్లు ఏమైనా ఉన్నాయా అని పరిశీలించారు. రైతులు చెప్పిన విధంగా తోటల్లోకి, మినుము పొలాల్లోకి వెళ్లి చూశారు. పలుచోట్ల ఉన్న కాలి ముద్రలను రైతులు చూపించగా డిఎఫ్ఒ వాటిని పరిశీలించారు. అనంతరం మెట్లపల్లి ప్రజలతో ఆమె మాట్లాడుతూ (మిగతా 2లో)

సిపిఎం మోపిదేవి మండల కార్యదర్శి

బండి ఆదిశేషు కన్నుమూత

నివాళులర్పిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు

సిపిఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి నరసింహారావు, ఎంఎల్‌ఎ బుద్ధప్రసాద్ ఘన నివాళి

ప్రజాశక్తి-చల్లపల్లి

సిపిఎం మోపిదేవి మండల కార్యదర్శి బండి ఆదిశేషు (66) మంగళవారం రాత్రి అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన భౌతికకాయాన్ని అవనిగడ్డ ఎంఎల్‌ఎ మండలి బుద్ధప్రసాద్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ఆదిశేషు చేసిన కృషి మరువలేనిదన్నారు. తన చివరి శ్వాస వరకు ఎర్రజెండా వీడలేదన్నారు. (మిగతా 2లో)

ఆదిశేషుకు నివాళులర్పిస్తున్న ఎంఎల్‌ఎ బుద్ధప్రసాద్, సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు

ఆదిశేషు

సంక్రాంతి బొమ్మల కొలువు ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ : సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 10వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో బిర్లా ఓపెన్ మైండ్స్ వారి సౌజన్యంతో "సంక్రాంతి బొమ్మల కొలువు ప్రదర్శన" జరగనుంది. నగరంలోని ఎంజి రోడ్‌లోని బాలోత్సవ్ భవన్లో జరిగే ఈ కార్యక్రమం పోస్టర్‌ను బుధవారం ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, ఎంబివికె బాధ్యులు సునీల్ కుమార్, కె.సత్యవతి, పి.విజయ, ఎ.సంధ్యారాణి, శ్రవణ్, పి.పావని తదితరులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా కె.సత్యవతి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ఉచిత ప్రవేశం ఉంటుందని, ఉత్తమ ప్రదర్శనకు ప్రత్యేక బహుమతి ప్రదానం చేస్తామని తెలిపారు. బొమ్మల కొలువు ఏర్పాటు చేసుకోవడానికి 5 ఇంటూ 6 అడుగుల స్థలం కేటాయిస్తామని, తల్లీ, పిల్లలు కలిసి పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఎ.సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రదర్శన ఏర్పాటు అనంతరం సాంస్కృతిక కార్యక్రమం, తదనంతరం బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. పాల్గొన్న అందరికి ప్రోత్సాహక బహుమతి ప్రదానం చేస్తామన్నారు. కళలు, సంప్రదాయాలను కొనసాగించడానికి మహిళలను ప్రోత్సహించడానికి చేసే తమ ప్రయత్నానికి ప్రజలు చేయూత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొనే వారు తమ పేర్లను ఫోన్ నెంబర్లకు 93462 93779, 77993 08775 వాట్సప్ చేయాలని కోరారు.

ఖోఖో చీఫ్ రిఫరీగా ప్రసాద్ నియామకం పట్ల హర్షం

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్

ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన ప్రముఖ ఫిజికల్ డైరెక్టర్, ప్రస్తుతం గుడివాడలోని శ్రీ పొట్టి శ్రీరాములు మున్సిపల్ హైస్కూల్‌లో సేవలందిస్తున్న మడక ప్రసాద్ తొలి ఖోఖో ప్రపంచకప్‌కు చీఫ్ రిఫరీగా నియమితులయ్యారు. జనవరి 13 నుండి 19 వరకు న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్ జరగనుంది. ఈ మేరకు ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు సుధాన్సు మిట్టల్, ప్రధాన కార్యదర్శి ఎంఎస్ త్యాగి ఒక సర్క్యులర్ జారీ చేశారు. చీఫ్ రిఫరీగా మడక ప్రసాద్ ఎంపిక కావడం తెలుగు రాష్ట్రాలకు, దేశానికే గర్వకారణం. అనేక జాతీయ క్రీడలలో చీఫ్ రిఫరీగా పనిచేసిన చరిత్రతో, అతను అనేక జాతీయ-స్థాయి ఛాంపియన్‌షిప్‌లతో పాటు ఆసియా ఖోఖో ఛాంపియన్‌షిప్, దక్షిణాసియా ఖోఖో ఛాంపియన్‌షిప్‌లలో కూడా రిఫరీగా సేవలందించారు. స్వతహాగా ఖోఖో క్రీడాకారుడు అయిన ప్రసాద్, కృష్ణా జిల్లా నుంచి పలువురు జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేయడంతోపాటు వారికి ప్రత్యేక శిక్షణ కూడా ఇస్తున్నారు. ప్రసాద్ ప్రస్తుతం ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా యొక్క కార్యనిర్వాహక సభ్యునిగా పనిచేస్తున్నారు. తొలి ఖోఖో ప్రపంచ కప్ నిర్వహణ బాధ్యతను కేంద్ర ప్రభుత్వం ఒలింపిక్ సంఘంఅధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలుఉషకు అప్పగించారు. ఈ టోర్నమెంట్‌ను విజయవంతం చేయడంతో పాటు ప్రపంచ దేశాలకు భారత్ క్రీడ సత్తాను చాటి చెప్పాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. మడక ప్రసాద్ ఖో ఖో ప్రపంచ కప్ చీఫ్ రిఫరీగా నియమితులుకావడంపై గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, కృష్ణా జిల్లా ఖోఖో సంఘం చైర్మన్ యలవర్తి శ్రీనివాస్, కార్యదర్శి మద్దినేని వెంకట సత్య ప్రసాద్, కృష్ణా జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సెక్రటరీ షేక్ జాన్, గుడివాడ డీవైఈవో పద్మారాణి, పొట్టి శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సొంటి కృష్ణ శ్రీనివాస్ తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా ఖోఖో ప్రపంచ కప్ చీఫ్ రిఫరీ మడక ప్రసాద్ మాట్లాడుతూ, ఇది తనకు గొప్ప గౌరవమన్నారు. వివిధ దేశాల నుండి అత్యంత ప్రతిభావంతులైన జట్లు ఈ టోర్నమెంట్‌లో పోటీపడతాయని, అలాంటి టోర్నమెంట్‌కు చీఫ్ రిఫరీగా తన బాధ్యతలను సమర్థంగా నెరవేర్చడానికి కట్టుబడి ఉంటానన్నారు. తనకు ఈ ప్రతిష్టాత్మకమైన పాత్రను అప్పగించినందుకు కెకెఎఫ్ఐ అధ్యక్షుడు సుధాన్షు మిట్టల్ మరియు ప్రధాన కార్యదర్శి త్యాగికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రియుడితో కలిసి తల్లిని హత్య చేసిన మహిళ

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం : వివాహేతర సంబంధాన్ని నిలువరించేందుకు ప్రయత్నించిన తల్లిని ఆమె కుమార్తె తన ప్రియుడితో కలిసి హత్య చేసిన ఘటన ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లిలో జరిగింది. కొండపల్లి ఖిల్లా రోడ్డు గుంట క్వారీలో నివాసం ఉంటున్న కుంచాల ఎస్తేరు అలియాస్ చెంచమ్మ తన ఇంటి వద్ద గాయాలతో చనిపోయినట్లు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించింది. దీంతో పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. విచారణలో వివాహేతర సంబంధం నేపథ్యంలో ఎస్తేరు రెండో కుమార్తె జీవమణి తన ప్రియుడి షేక్ నాగూర్ వలితో కలిసి రోకలి బండతో ఆమెను కొట్టడంతోపాటు కింద పడిన ఆమె తలను సిమెంట్ రాయికి ఇద్దరు కలిసి కొట్టడంతో మరణించింది. అనంతరం అక్కడి నుండి వెళ్లిపోయారు. పద్ధతి మార్చుకోవాలని తరచూ కొడవ పడుతున్న తల్లిని జీవమణి హత్య చేసినట్లు గుర్తించారు. నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

29న యుజిసి జాతీయ సదస్సు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని జువాలజీ అండ్ ఆక్వాకల్చర్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల యుజిసి జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు సదస్సు డైరెక్టర్, విభాగాధిపతి ఆచార్య వి. వెంకటరత్నమ్మ తెలిపారు. లిరీసెంట్ అడ్వాన్ సెస్ ఇన్ టాక్సికాలజీ, ఇమ్యూనాలజీ అండ్ బయోడైవర్సిటీలో అనే అంశంపై ఈనెల 29, 30 తేదీలలో సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సదస్సు బ్రోచర్‌ను బుధవారం వైస్ ఛాన్సలర్ ఆచార్య కే .గంగాధర రావు, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం ఆవిష్కరించారు.

ఎపిఎంఇఎస్ఎ విఎంసి యూనిట్ అధ్యక్షులుగా సురేంద్రబాబు

ప్రజాశక్తి-విజయవాడ: ఎపి మునిసిపల్ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తిమ్మసర్తి నాగేశ్వరరావు , ఎపిఎంఇఎస్ఎ విఎంసి యూనిట్ నూతన అధ్యక్షుల ఎన్నిక కొరకు కార్యవర్గ సభ్యుల సమావేశము నగరపాలక సంస్థ ఎంప్లాయిస్ అసోసియేషన్ హాల్‌లో జరిగింది. ఈ సమావేశములో రాష్ట్ర నూతన అధ్యక్షులు తిమ్మసర్తి నాగేశ్వరరావు, ఎపిఎంఇఎస్ఎ విఎంసి యూనిట్ జనరల్ సెక్రెటరీ సలీం అహ్మద్ , కార్యవర్గ సభ్యులు ఏకాభి ప్రాయముతో యూనిట్ నూతన అధ్యక్షులుగా ఎ శ్యామ్ సురేంద్ర బాబును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విఎంసి యూనిట్ నూతన అధ్యక్షులు శ్యామ్ సురేంద్రబాబు మాట్లాడుతూ విజయవాడ నగరపాలక సంస్థ ఉద్యోగులకు, ఏపీ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలో మున్సిపల్ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ విజయవాడ యూనిట్ అధ్యక్షునిగా తనను ఎన్నుకున్నందుకు, రాష్ట్ర నాయకత్వానికి, ఎన్టీఆర్ జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని విఎంసి ఉద్యోగుల సమస్యల సాధన కోసం శక్తివంచన లేకుండా కషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ కె. శివరామ ప్రసాద్, స్టేట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జి శ్రీకృష్ణ దేవరాయలు, ఉపాధ్యక్షులు ఎస్‌కె రాంబాబు గారు, అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీ గుర్రం ప్రకాష్ సాగర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీ కె.సురేంద్ర కుమార్ ,పబ్లిసిటీ సెక్రెటరి శ్రీ జ.మారుతీరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రణాళిక : కమిషనర్

ప్రజాశక్తి-విజయవాడ

ప్రజలకు ఎటువంటి సమస్య రాకుండా ముందస్తు ప్రణాళికతో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ లో సీ.డీ.ఎమ్.ఏ వారు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ కాన్ఫరెన్స్లో ఏ బి సి ఆపరేషన్స్, పాట్ హోల్ రేపైర్స్, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ, అన్న క్యాంటీన్ నిర్వహణ, త్రాగునీటి సరఫరా తదితర అంశాలపై చర్చించారు. ప్రజలకు ఎటువంటి సమస్య రాకుండా ముందుగానే ప్రణాళికలతో ఉండేటట్టు అధికారులను సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్ మూతల్ని రోడ్డు లెవెల్‌లో ఉంచండి

రోడ్డుపై ఉన్న మ్యాన్‌హోల్ మూతల్ని రోడ్డు లెవెల్‌లోకి సరిచేయాలని కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం 23వ డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామితో కలిసి ఆ డివిజన్లోని ప్రజల సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అందులో భాగంగా బీసెంట్ మహంతి మార్కెట్, కర్నాటి రామ్మోహన్ రావు స్కూల్, చలసాని వెంకటరత్నం వీధి, ప్రకాశం రోడ్డు, పొగాకు బారెల్ రోడ్డు, కాళేశ్వరం రోడ్డు, ఐవీ ప్యాలెస్ ప్రాంతాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

మొదటిపేజీ తరువాయి

మెట్లపల్లిలో రాత్రిళ్లు బయట తిరగొద్దు

పులి సంచరిస్తున్నట్లుగా స్పష్టమైన ఆనవాళ్లుతమకు కనిపించలేదని చెప్పారు. అడవి కుక్కలు, ఇతర జంతువులు ఏమైనా తిరుగుతున్నాయా అని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. రాత్రి వేళలో గ్రామస్తులు, పిల్లలు ఎవ్వరూ ఒంటరిగా తిరగవద్దని చెప్పారు. తోటల్లో ఉండే వారు రాత్రి వేళలో మంటలు వేయాలని, లైట్లు వేసి ఉంచాలని చెప్పారు. అటవీ శాఖ సిబ్బంది రెగ్యులర్‌గా అటవీ ప్రాంతంలో, తోటల్లో తిరుగుతూనే ఉంటారన్నారు. ప్రజలు, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ గన్నవరం మండల అధికారిణి సిహెచ్ సునీత, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బండి ఆదిశేషు కన్నుమూత

కమ్యూనిస్టు పార్టీ ఆశయాలకు, ఉద్యమాలకు అండగా నిలిచారన్నారు. బండి ఆదిశేషు మరణం సిపిఎంకు తీరని లోటని, ఆయన కుటుంబానికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. అలాగే సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్లం వెంకటేశ్వరరావు, శీలం నారాయణరావు, కోసూరు శివ నాగేంద్ర, పంచకర్ల రంగారావు, జిల్లా కమిటీ సభ్యులు యద్దనపూడి మధు, మల్లంపల్లి ఆంజనేయులు, పి మోహన్ రావు, తాడంకి నరేష్, బూర సుబ్రహ్మణ్యం, సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు మర్రాపు పోలినాయుడు, మహమ్మద్ కరీముల్లా, సీనియర్ నాయకులు వాకా రామచంద్రరావు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు చీకటి రాజేష్, సంధ్యాల ప్రభు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఖాసిం, కొండ, మాజీ సర్పంచ్ కోసూరు రామాంజనేయులు, మోపిదేవి మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరరావు, మండల టిడిపి అధ్యక్షులు జనార్ధన్, సిపిఐ నాయకులు అడ్డాడ ప్రసాద్ తదితరులు ఆదిశేషు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆదిశేషు అంతిమయాత్రలో రాజకీయాలకు అతీతంగా పలువురు నాయకులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

చేస్తున్నట్లు తెలిపారు. భూ వివాదాల్లేని గ్రామాలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సదస్సులు నిర్వహించిందన్నారు. అధికారులు అర్జీల పరిష్కారంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు, రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు, గుంటుపల్లి సర్పంచ్ బి.కవిత తదితరులు పాల్గొన్నారు.

బిజెపిలో కుల వివక్ష!

వెనుకాడుతున్నారని వాపోయారు. ఈ క్రమంలోనే ఆగ్రహించిన కార్యకర్తలు కొందరు బాలాజీకి దేహశుద్ధి చేసినట్లు వీడియోలో స్పష్టం అవుతోంది.

టిడిపి, జనసేనల్లో కలవరం!

ఈ ఘటన టిడిపి, జనసేనల్లోనూ కలవరం రేకెత్తిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి మంత్రి కొల్లు రవీంద్ర ఏర్పాటు చేసే ప్రతి కార్యక్రమంలోనూ జనసేన బందరు ఇంఛార్జి బండి రామకృష్ణ, బిజెపి నగర ఇన్‌ఛార్జి సోడిశెట్టి బాలాజీలు పాల్గొంటారు. వివిధ అంశాలపై మీడియా సమావేశాల్లోనూ ముగ్గురు నాయకులు పక్కపక్కనే ఉండి ఒకరి తర్వాత మరొకరు మాట్లాడతారు. తాజాగా బాలాజీ అనుచరులు కుల దూషణకు పాల్పడ్డారనే విషయం బహిర్గతమవ్వడంతో ఈ ప్రభావం భవిష్యత్‌లో తమపై పడుతుందని ఆందోళన చెందుతున్నారు.

విజయవాడ అభివృద్ధికి చర్యలు

అదనంగా ఏర్పాటు చేస్తూ...శానిటేషన్‌లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అలాగే నగర వ్యాప్తంగా నాలుగు వేల మంది కార్మికులతో రోజువారీ శానిటేషన్ పని చేయడం జరుగుతుందన్నారు. నగరంలో 69 కిలోమీటర్ల లిట్టర్ ఫ్రీ రోడ్లు, వివిధ ముఖ్య కూడలిలోని రోడ్లను పరిశుభ్రంగా ఉంచడం జరుగుతుందన్నారు. పారిశుధ్యం మెరుగుదలకు వినియోగించే వాహనాలను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయిస్తూ, పని ఆగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించడం జరుగుతుందన్నారు. విజయవాడ పశ్చిమ, సెంట్రల్, తూర్పు నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున రహదారుల మరమ్మతు పనులు జరిగాయన్నారు. సిసి, బిటి, తారు రోడ్లను కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.160. 23 కోట్లు వివిధ రకాల పన్నులు వసూలు చేయడం జరిగిందన్నారు.

ఆందోళన చేస్తున్న కార్మికులు

పెండింగ్ వేతనాలు ఇవ్వాలని ఆందోళన

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం రాఖీ అవెన్యూస్ యాజమాన్యం కార్మికులకు ఇవ్వాల్సిన పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని జరుగుతున్న ఆందోళన బుధవారం ఉదతమైంది. భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని తమ నిరసన తెలిపారు. ఆరు సంవత్సరాలుగా కార్మికులకు కోట్ల రూపాయలు పెండింగ్ పెట్టి అప్పటి యజమాని వేణు ఇబ్బందులకు గురి చేశాడని నాయకులు మండిపడ్డారు. వెంటనే బకాయిలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో మరియదాసు, బ్రహ్మచారి, మిరప నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కారానికి సహకరించాలి

ప్రజాశక్తి-ఘంటసాల : రైతు సమస్యల పరిష్కారానికి నీటి సంఘాల అధ్యక్షులు సహకరించాలని శ్రీకాకుళం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ అయినంపూడి భాను ప్రకాష్ అన్నారు. ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళంలో గల నీటి పారుదల శాఖ సెక్షన్ కార్యాలయంలో బుధవారం భాను ప్రకాష్ అధ్యక్షతన నీటి సంఘాల అధ్యక్షులు, అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. తానేటి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నీటి పారుదల శాఖ డీఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు, డ్రైనేజీ డీఈ జే బాబునాయక్‌లు తమ శాఖల ద్వారా నీటి సంఘాలకు కల్పిస్తున్న సౌకర్యాలు, నిధుల వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా పలువురు నీటి సంఘాల అధ్యక్షులు తమ పరిధిలో గల సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. శ్రీకాకుళం డిసి పరిధిలోని కెఈబీ కెనాల్ పరిధిలోని యనమలకుదురు నుంచి నిమ్మగడ్డ లాకుల వరకు 54 కిలోమీటర్ల వరకు, 2,3,4,5 నెంబర్ల కాలువల పరిధిలో గుర్రపు డెక్క, నాచు, గూబీ, తూటుకాడ తొలగింపుకు రూ.89.48 లక్షల నిధులతో పనులు జరుగుతున్నట్లు చైర్మన్ భాను ప్రకాష్ తెలిపారు. డిసి వైస్ చైర్మన్ సుగ్గుణ రాంబాబు, డ్రైనేజీ జేఈ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌లో సదుపాయాల కల్పనకు చర్యలు : కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నం నియోజకవర్గం అభివద్ధిలో భాగంగా మంగినపూడి బీచ్‌లో యాత్రికులకు అవసరమైన సదుపాయాల కల్పనకు అవసరమైన చర్యలు తీసుకోవా లని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర గనులు భూగర్భవ నరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశాల మేరకు నియోజకవర్గ అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై సంబంధిత అధికారులతో బుధవారం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్లో సమావేశం నిర్వహించి సమీక్షించారు. మంగినపూడి బీచ్ పర్యాటక కేంద్రంగా అభివద్ధి పరిచేందుకు యాత్రికులకు కనీస సౌకర్యాల కల్పనలో భాగంగా బయో టాయిలెట్స్ ఏర్పాటు చేయడంతో పాటు సులబ్ కాంప్లెక్స్ తరహాలో వాటి నిర్వహణ చర్యలు తీసుకోవడం, పార్కింగ్ ఏర్పాటు, నిర్వహణకు సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగేబందరు కోటలో హెరిటేజ్ పార్క్ ఏర్పాటుకు తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. పోతేపల్లి పారిశ్రామికవాడ లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటుకు తీసుకోవలసిన చర్యలపై కలెక్టర్ చర్చించారు. మూడు స్తంభాల సెంటర్ సమీపంలో గల మడుగు పోరంబోకు భూమి అభివద్ధికి తీసుకోవలసిన చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో బందర్ ఆర్డీవో కే స్వాతి, డ్వామా పిడి కె.వి శివప్రసాద్ యాదవ్, జిల్లా టూరిజం అధికారి రామ్ లక్ష్మణ్, పరిశ్రమల శాఖ జీఎం ఆర్ వెంకట్రావు, సర్వే ఏడి జోషిలా, పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేత

ప్రజాశక్తి-గన్నవరం : మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ గన్నవరం ఆధ్వర్యంలో గన్నవరం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభా పురస్కారాలు, నగదు రివార్డులు అందజేస్తున్నట్లు అధ్యక్షులు మడుపల్లి బాలకష్ణమూర్తి తెలిపారు. బుధవారం ప్రభుత్వ పాఠశాలల్లో కార్యక్రమం జరిగింది .6,7,8,9, తరగతులు విద్యార్థులకు మొదటి స్థానం, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులకు 1000 రూపాయలు నగదు, బహుమతి ప్రశంసా పత్రము మెమొంటో ద్వితీయ స్థానం వారికి 500 రూపాయలు నగదు మరియు ప్రశంసా పత్రములు అందించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, దావాజీగూడెం, జడ్.పి.హెచ్.ఎస్ బాలికలు గన్నవరం, జడ్పీహెచ్ఎస్ బాలురు గన్నవరం, జడ్.పి.హెచ్.ఎస్ గొల్లనపల్లి, జడ్పీహెచ్ఎస్ సూరంపల్లి, డాక్టర్ బి ఆర్అంబేద్కర్ గురుకుల పాఠశాల, వీరపనేని గూడెం, జడ్పీహెచ్ఎస్ వీరపనేని గూడెం లలో పురస్కారాలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవతా అధ్యక్షులు మడుపల్లి బాలకష్ణమూర్తి, కార్యదర్శి కర్రావరప్రసాద్, సహాయ కార్యదర్శి వీసం ప్రసాదరావు, మానవతా విద్యా డైరెక్టర్ సయ్యద్ లాల్, సభ్యులు గన్నే వెంకట్రావు, పలగాని శివాజీ తదితరులు పాల్గొన్నారు

రహదారి నిర్మాణ పనులు ప్రారంభం

పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండల పరిధిలోని మల్లాయి చిట్టూరు గ్రామంలో నూతనంగా నిర్మించే రెండు సీసీ రహదారి నిర్మాణ పనులకు సర్పంచ్ ఆవుల రేవతి, మల్లాయి చిట్టూరు నీటి సంఘం అధ్యక్షులు ఆవుల ధర్మ వెంకట నరసయ్యలు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆవుల ధర్మ వెంకట నరసయ్య మాట్లాడుతూ గ్రామంలోని రెండు సిసి రహదారుల నిర్మాణ పనులను ప్రారంభించామని, రూ.10 లక్షల వ్యయంతో 150 మీటర్లు మేర నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చింతల నాగబాబు, వార్డు సభ్యులు నరహరిశెట్టి విజయరాణి, గుత్తి ఆంజనేయులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ భాగ్యలక్ష్మి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న వ్యక్తులపై కేసు

ప్రజాశక్తి-గన్నవరం : మండలంలోని ముస్తాబాద్ గ్రామంలో రైల్వే భూభాగంలో నుండి ఎటువంటి అనుమతి లేకుండా అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రేమ్ కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం ముస్తాబాద్ గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసామన్నారు. దర్యాప్తులో భాగంగా మట్టిని అక్రమంగా తరలిస్తున్న 6 టిప్పర్ లారీలు అదుపులోనికి తీసుకున్నట్లు వివరించారు. రైల్వే లైన్ పనులకు సంబంధించిన మట్టిని కాంట్రాక్టర్ సహాయంతో టిప్పర్ల ద్వారా స్వాలాభానికి అమ్ముకుంటున్నట్లుగా ప్రాథమిక విచరణలో తెలిసిందన్నారు. అయితే మట్టి తరలింపు ప్రదేశంలో రెండు వర్గాలకు చెందిన వ్యక్తులు దాడి చేసి కొట్టుకున్నట్లుగా తెలిసింది. రెండు వర్గాల వారు అధికార పార్టీకి చెందిన వారు కావడం గమనార్హం.

ధర్నా చేస్తున్న కార్మికులు

ఇసుక ముఠా కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : తోట్లవల్లూరు గ్రామంలో ఇసుక ముఠా కార్మికులు బుధవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఇసుక క్వారీల్లో యంత్రాల లోడింగ్ నిలుపుదల చేసి తమకు పని కల్పించాలని ధర్నాకు దిగారు. క్వారీలో నుంచి వస్తున్న ఇసుక లారీలను అడ్డగించి, టెంట్ వేసి ధర్నాకు కూర్చున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్మికుల నిరసన కొనసాగుతూనే ఉంది. పమిడిముక్కల సీఐ వై.చిట్టి బాబు,ఎస్సై అర్జున్ రాజు కార్మికుల వద్దకు వెళ్లి చర్చలు జరిపారు.

సర్పంచ్ ఫిర్యాదుపై విచారణ

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : మండలంలోని భద్రిరాజు పాలెం గ్రామ సర్పంచ్ కొక్కిలి గడ్డ హేమలత మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో తన గ్రామంలో తమకేమీ తెలియకుండానే, పంచాయతీ తీర్మానం చేయకుండానే, తన ఆమోదం లేకుండానే ఉపాధి హామీ పనులు చేయడాన్ని సభ ముందుకు తీసుకువచ్చారు. స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా స్పందించి ఎంపీడీవో కేఎస్ రవికాంత్‌కు అప్పగించి దీనిపై ఆరా తీయాలని చెప్పారు. దీంతో బుధవారం ఎంపీడీవో రవికాంత్, కార్యదర్శులు పి.సత్యనారాయణ,తావీర్యా, ఉపాధి ఏపీవో జీ కిరణ్ బద్రిరాజుపాలెం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ హేమలత సమక్షంలో పిలిచి విచారించారు. ఉపాధి హామీ రికార్డులను పరిశీలించగా గ్రామ సభ తీర్మానంలో సర్పంచి సంతకం పెట్టకుండానే పనులు చేశారని తేలింది. దీంతో ఎంపీడీవో ఇకపై నుంచి అలా చేయకూడదని, సర్పంచిని గౌరవించి, గ్రామంలో తీర్మానించిన పనులు సర్పంచ్ ఆమోదం పొందిన తర్వాతనే మొదలు పెట్టాలని, సర్పంచ్ సూచనలు సలహాలు మేరకు మాత్రమే పనులు మొదలు పెట్టాలని ఎఫ్ఎను హెచ్చరించారు.

విచారణ చేస్తున్న దృశ్యం

బండి ఆదిశేషు మృతికి సంతాపం

ఆదిశేషు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న అవనిగడ్డ నాయకులు

గుడివాడలో నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : మోపిదేవి మండల సిపిఎం కార్యదర్శి బండి ఆదిశేషు ఆకస్మిక మృతి పట్ల నియోజకవర్గంలోని పలువురు దళిత సంఘాల నాయకులు సంతాపం తెలిపారు. బుధవారం మోపిదేవి లోని ఆదిశేషు స్వగహానికి వెళ్లి ఆయన పార్థవ దేహాన్ని సందర్శించి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదిశేషు మృతి పేద వర్గాలకు తీరని లోటుగా అభివర్ణించారు. సిపిఎం నిబద్ధతగల కార్యకర్తగా నాయకుడిగా పనిచేస్తూ సమాజ మార్పు కి తన వంతు కృషి చేసిన బండి ఆదిశేషు మరణం దివిసీమ ప్రాంత వాసులకు తీరని లోటుగా తెలిపారు. ఆయన మరణం పట్ల సంతాపం తెలుపుతూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దోవ గోవర్ధన్, అంబేద్కర్ అభిమాని దాసి సీతారామరాజు, పాత్రికేయులు కేయూ గాగరిన్ నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ప్రజాశక్తి - గుడివాడ : పార్టీ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి బండి ఆదిశేషు అని సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి పేర్కొన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో కామ్రేడ్ బండి ఆదిశేషు అకాల మరణాన్నికి గుడివాడ సిపిఎం పట్టణ కమిటీ బుధవారం నివాళులర్పించింది. సీనియర్ నాయకుడు నీలం మురళీకష్ణ రెడ్డి, నాయకులు ఎల్ సురేంద్ర, బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలకు అనుమతులు లేవు

ప్రజాశక్తి - నందిగామ : సంక్రాంతి పండుగ సందర్భంగా విజయవాడ సిపి రాజశేఖర్ బాబు ఆధ్వర్యంలో ఎలాంటి కోడి పందాలకు, కాసినో, జూదాల వంటి వాటికి ఎక్కడా అనుమతులు ఇవ్వలేదని విజయవాడ రూరల్ డిసిసి మహేశ్వర రాజు తెలిపారు. బుధవారం నందిగామ సబ్ డివిజన్ పోలీస్ అధికారి కార్యాలయం ఆవరణలో గంజాయి కేసుకు సంబంధించిన వివరాలు అందజేసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎన్‌టిఆర్ జిల్లాలో ఎక్కడా కోడి పందాలకు, కాసినో, జూదల వంటి వాటిని జరగకుండా నిరోధించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. జాతీయ రహదారిపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వాహనదారులు ప్రయాణించే సమయంలో తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, ఇప్పటి వరకు వాహనాల మీద ఉన్న చలానాలను చెల్లించాలని, లేకుంటే వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. ఎసిపి కెబిజి తిలక్, సిఐలు వైవిఎల్ నాయుడు, చవాన్,వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

10 నుండి నగరంలో ప్రాపర్టీ షో

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఈ నెల 10 నుండి మూడు రోజుల పాటు నగరంలోని ఎ కన్వెన్షన్ సెంటర్‌లో క్రిడాయి ప్రాపర్టీ షో నిర్వహిస్తున్నామని క్రిడాయి విజయవాడ చాప్టర్ అధ్యక్షులు రాంబాబు తెలిపారు. ప్రాపర్టీ షో వివరాలను తెలిపేందుకు నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో పదేళ్లుగా ప్రాపర్టీ షో నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరికీ సొంత ఇంటిని అందించాలనే లక్ష్యంతో ప్రాపర్టీ షో నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రాపర్టీ షోలో 50 స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రదర్శనను రాష్ట్ర మంత్రులు ఎస్.నారాయణ , లోకేష్, కొల్లు రవీంద్ర పాల్గొని ప్రారంభిస్తారన్నారు. ఈ ప్రదర్శనకు టైటిల్ స్పాన్సర్‌గా ఎస్.ఎల్.వి ప్రాజెక్ట్, డైమండ్ స్పాన్సర్‌గా పి.వి.ఆర్ గ్రూప్, ప్లాటినం స్పాన్సర్‌గా బ్యాంకులు, నిర్మాణ రంగ సంస్థలు వ్యవహరిస్తాయన్నారు.

పాము కాటుకు గురైన కార్మికుడికి పరామర్శ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గంలోని ఆంజనేయ వాగు సెంటర్ కొండ ప్రాంతంలో నివాసం ఉంటున్న మట్టి కార్మికుడు ప్రసాద్‌ను ఈ నెల 7వ తేదీ మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఇంటి వద్ద ఉండగా ఆకుపసర పాము ప్రసాద్ చేతిపై కాటు వేసింది. వెంటనే స్థానిక కుటుంబ సభ్యులు షేక్ రాజా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసి మట్టి లిఫ్ట్ వర్కర్స్ సిఐటియు యూనియన్ నాయకులు కె.సూరిబాబు, సిఐటియు పశ్చిమ నగర ఉపాధ్యక్షులు, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు, గోపి తదితరులు పరామర్శించారు. వైద్యం అందించాలని వైద్యులను కోరారు. నగరపాలక సంస్థ విఎఎస్ డాక్టర్ కొండ ప్రాంతాల్లో ప్రజలకు ప్రమాదకరంగా ఉన్న పాములను గుర్తించి అటవీ ప్రాంతానికి తరలించాలని కార్పొరేటర్ బి.సత్యబాబు విజ్ఞప్తి చేశారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పని ప్రదేశాల్లో మహిళల్ని లైంగిక వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని, లైంగిక హింసను తీవ్రమైన నేరంగా చట్టాలు పరిగణిస్తాయని ప్రముఖ కార్పొరేట్ ట్రైనర్ ఎం.యోగిత అన్నారు. యుజిసి మహిళా అధ్యయన కేంద్రం, కాన్సెప్ట్ ఆఫ్ లివింగ్ ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం కె.బి.ఎన్. కళాశాలలో లైంగిక వేధింపుల నివారణ (పోష్) చట్టం-2013పై అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న యోగిత పోష్ చట్టం గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థినుల భద్రత కోసం తమ కళాశాలలో సిసి కెకెరాల ద్వారా నిరంతర నిఘా వ్యవస్థ పనిచేస్తుందన్నారు. హిందూ హైస్కూల్ అడ్మినిస్ట్రేటివ్ అఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, మహిళా అధ్యయన కేంద్ర బాధ్యులు కె.స్వాతి, కె.వనమాదేవి, శ్రీదేవి పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : సుజనా ఫౌండేషన్, సీడ్స్ ఇంపాక్ట్ సంయుక్త ఆధ్వర్యంలో రామరాజ్యనగర్‌లోని గొల్లపల్లి నాగేశ్వరరావు మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ విద్యార్థులకు బుధవారం ఉచిత కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ నేత్ర వైద్య పరీక్షల శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.వి.రవికుమార్ ప్రారంభించారు.150 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా 96 మంది విద్యార్థులకు దష్టిలోపం ఉన్నట్లు నిర్ధారించారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా 33 రోజుల పాటు రెవెన్యూ సదస్సులు జరిగాయని, సదస్సుల్లో మొత్తం దాదాపు 4,813 పిటిషన్లు రాగా 1,819 అర్జీలను పరిష్కరించినట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. గడువులోగా మిగిలిన వాటి పరిష్కారానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద చివరి రోజు జరిగిన గూడూరుపాడు రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (పిజిఆర్ఎస్) స్టాల్ కార్యకలాపాలను పరిశీలించారు. ప్రభుత్వ భూముల రిజిస్టర్, రెవెన్యూ సదస్సుల మినిట్స్ రిజిస్టర్, ఎండోమెంట్ భూములు, అసైన్‌మెంట్ భూములు తదితర వివరాలను పరిశీలించారు. గ్రామస్తులు అందించిన పిటిషన్ల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. సదస్సుకు హాజరైన ప్రతిఒక్కరినీ పలకరించి సమస్యలు ఏవైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 6న రెవెన్యూ సదస్సులు ప్రారంభమయ్యాయని, బుధవారం వరకు షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిస్తూ, సమాచారమిస్తూ సదస్సులు నిర్వహించినట్లు వివరించారు. వీటిలో ఎఫ్ లైన్ (బౌండరీ డీమార్కేషన్), ఇనామ్స్, అసైన్‌మెంట్ ల్యాండ్స్, భూ సేకరణ, రీసర్వే, ఆక్రమణలు, 22ఏ తదితరాలకు సంబంధించిన పిటిషన్లు వచ్చాయన్నారు. భూ హక్కుకు భరోసా కల్పిస్తూ భూ సమస్యలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించనున్నట్లు తెలిపారు. కుటుంబ తగాదాలతో కొన్ని, మరికొన్ని కోర్టుల పరిధిలో ఉన్నాయని వివరించారు. కొన్ని సమస్యలు తక్షణమే పరిష్కారం కాకపోయినా ప్రత్యేక ప్రణాళికతో వాటి పరిష్కారానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

భూ వివాదాలు లేని గ్రామాలు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సదస్సులు నిర్వహించిందని, విఆర్ఓ, తహశీల్దార్, సర్వేయర్ తదితర క్షేత్రస్థాయి అధికారులు అర్జీల పరిష్కారంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. సదస్సులో భాగంగా గ్రామస్తులు కోరిన భూ రికార్డుల వివరాల పత్రాలను కలెక్టర్ లక్ష్మీశ అందజేశారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీనివాసరావు, ఇబ్రహీంపట్నం తహశీల్దార్ వై.వెంకటేశ్వర్లు, గుంటుపల్లి సర్పంచ్ బి.కవిత తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ లక్ష్మీ శ

డ్వాక్రా సంఘాలకు పూర్వవైభవం : సౌమ్య

ప్రజాశక్తి - కంచికచర్ల : మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ప్రారంభించిన డ్వాక్రా సంఘాలకు పూర్వవైభవం తీసుకొస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. కంచికచర్ల వెలుగు కార్యాలయంలో బుధవారం జరిగిన ముగ్గుల పోటీలను ఎమ్మెల్యే సౌమ్య ప్రారంభించారు. రంగు రంగుల రంగవల్లులతో మహిళలు అందమైన ముగ్గులు వేస్తూ, ఆటలు ఆడుతూ పండగకు ముందే కొత్త శోభను తీసుకువచ్చారు. నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య డ్వాక్రా మహిళలతో వెలుగు సిబ్బందితో కలిసి సంబరాల్లో పాల్గొన్నారు. పాలుపంచుకున్నారు. కోటి సభ్యులు ఉన్న ఏకైక సంఘం డ్వాక్రాం సంఘాలు అని సౌమ్య అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ప్రారంభించిన డ్వాక్రా సంఘాలకు పూర్వవైభవం తీసుకొస్తానని అన్నారు. ఈ సందర్భంగా రంగవల్లులు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు పీడీ శ్రీనివాసరావు, ఎంపీడీవో బిఎం లక్ష్మి కుమారి, మండల టిడిపి అధ్యక్షుడు కోగంటి బాబు, ఏపీఎం శ్రీనివాసరావు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కల్పన, సర్పంచ్ మన్నే సాత్విక, మండల సమాఖ్య అధ్యక్షురాలు నల్ల నాగుల అరుణ పాల్గొన్నారు.

నిర్మాణ పనులను ప్రారంభించిన సర్పంచ్ నాగమల్లేశ్వరి

సిసి రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి - మైలవరం : మండలంలోని పుల్లూరు గ్రామంలోని బిసి కాలనీలో సిసి రహదారి నిర్మాణ పనులను బుధవారం సర్పంచ్ నాగ మల్లేశ్వరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుల్లూరులో రూ.35 లక్షలతో పలు రహదారులు, కల్వర్టుల నిర్మాణా లను చేస్తున్నామన్నారు. 15వ ఆర్థిక సంఘం నుంచి 15 లక్షలు, జనరల్ ఫండ్ రూ.20 లక్షలతో పుల్లూరులో అవసరమైన చోట్ల సిసి రహదారులు, కల్వర్టులు నిర్మాణాలు చేస్తున్నా మన్నారు. వైసిపి సీనియర్ నాయకులు చిలుకూరి రామిరెడ్డి, మాజీ మండల అధ్యక్షులు ఉండ్రగుంట తిరుపతిరావు, పుల్లూరు మాజీ సర్పంచి రోశయ్య, స్థానికులు పాల్గొన్నారు.

వర్మీకంపోస్ట్‌తో భూసారం పెరుగుదల

ప్రజాశక్తి - కంచికచర్ల : వర్మి కంపోస్ట్ ఎరువు వాడకం వల్ల భూసార పెంపుదల పెరుగుతుందని సర్పంచ్ వేల్పుల సునీత శ్రీనివాస్, ఎంపిడిఒ లక్ష్మి కుమారి, ఇఒపిఆర్‌డి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రమైన కంచికచర్లలో చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రాన్ని బుధవారం ఎంపిడిఒ, ఇఒఆర్‌డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్ల నుండి పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా సేకరించిన తడి పొడి చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించి అక్కడనుండి తడి చెత్త, పొడి చెత్త, ప్లాస్టిక్ వేరు చేస్తారన్నారు. చెత్తను వేరు చేసిన తర్వాత తడి చెత్తతో పశువుల పేడను కలిపి రెండు నెలలు నిలువ ఉంచిన తర్వాత బాగా డ్రై అయిన కంపోస్టును వేరే తొట్లకు వేయనున్నట్లు చెప్పారు. ఆ తొట్లో వానపాములు వేయడం ద్వారా వర్మి కంపోస్ట్ ఎరువు తయారవుతుందన్నారు.

సమస్యలు లేని అంగన్వాడీ సెంటర్లకు కృషి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని చిల్లకల్లు గ్రామంలో చిల్లకల్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సిడిపిఒ లక్ష్మీ భార్గవి ఆధ్వర్యంలో బుధవారం ప్రాజెక్టు సమావేశం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలకు, అంగన్వాడీ ఆయాలకు సంక్షేమ పథకాలన్నీ వర్తించేలా ప్రభుత్వ దృష్టికి తీసుకుని వెళ్తానని అన్నారు. అంగన్వాడీ కేంద్రంలో తాగునీటి వసతి, కాంపౌండ్ వాల్స్ మరియు మౌలిక సౌకర్యాలు అందరికీ వర్తించేలా చూస్తామన్నారు.

రాష్ట్ర సైన్స్‌ఫెయిర్‌లో పేట విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఈ నెల 7,8 తేదీల్లో విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో జగ్గయ్యపేట పట్టణానికి చెందిన జి.వి.జె బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులు ఎం.నాగతేజ, వై.భార్గవ ధనుష్ గైడ్ టీచర్ జి.చంద్రశేఖర్ పర్యవేక్షణలో తయారు చేసిన ప్రొటెక్షన్ వెహికల్ అండ్ బ్రిడ్జెస్ ఫ్రం ఫ్లడ్స్ అనే ప్రాజెక్ట్ విజయం సాధించింది. ఈ నెల 20 నుండి పాండిచ్చేరిలో జరిగే సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో వీరు పాల్గొంటున్నారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయులకు సర్వీస్ ఇవ్వాలి

ప్రజాశక్తి - వీరులపాడు : ఎయిడెడ్ ఉపాధ్యాయులకు 50 శాతం సర్వీస్ ఇవ్వాలని ప్రభుత్వ విలీన ఎయిడెడ్ ఉపాధ్యాయుల అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు మోహన్ వెంకట కృష్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వం 2021 ఆగస్టులో జిఒ నెంబర్ 50ని ప్రకటించి ఆంధ్రప్రదేశ్లో ఉన్న ఎయిడెడ్ పాఠశాలలను చాలా వరకు మూసివేసిందన్నారు. స్వాతంత్ర్యం పూర్వం నుండి మారుమూల ప్రాంతాల్లో విద్యా సేవ చేస్తున్న ఎయిడెడ్ పాఠశాలలకు రాబోయే రోజుల్లో గ్రాంట్ నిలుపుదల జరుగుతుందని, ఎయిడెడ్ పాఠశాలల్లోని విద్యార్థులను సమీప ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించడం ద్వారా ఎయిడెడ్ పాఠశాలలు రాష్ట్రవ్యాప్తంగా చాలాచోట్ల మూసి వేయబడ్డాయన్నారు. ఎయిడెడ్ పాఠశాలలు ఉపాధ్యాయులుగా 22 సంవత్సరాల నుండి 30 సంవత్సరాల సర్వీస్ చేసి వృద్ధాప్యం, దీర్ఘ కాల వ్యాధులతో బాధపడుతున్న టీచర్స్ సర్వీస్ 0 సున్నా చేయడం వల్ల బాధ పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సత్యానందం మాస్టర్, పూల వెంకటేశ్వరరావు మాస్టర్, కొనతం సుబ్బారావు మాస్టర్, జోత్స్న టీచర్, బాణావతి సుబ్బారావు మాస్టర్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కృష్ణ

రిజర్వాయర్ నిర్మించాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గంలోని 50వ డివిజన్లో మంచినీటి సమస్య పరిష్కారానికి రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు పలుమార్లు కమిషనర్ అధికారులకు తెలియజేయగా సర్కిల్ వన్ ఈ.ఈ.వెంకటేశ్వర రెడ్డి, డీఈ కరుణాకర్, ఏ.ఇ. శ్రీనివాస్ రిజర్వాయర్ నిర్మాణ ప్రాంతాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ కొండ ప్రాంతం ప్రజలకు, కింద ప్రాంత ప్రజలకు వేసవి కాలంలో నీటి సమస్యలు, ఇబ్బందులు పెరుగుతున్నాయని, దీన్ని అధిగమించేందుకు అదనంగా మంచినీటి రిజర్వాయర్ నిర్మాణం చేపట్టవలసిన ఆవశ్యకతను కమిషనర్‌కి తెలిపామన్నారు. మంచినీటి రిజర్వాయర్ మంజూరు పనులు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మంచినీటి రిజర్వాయర్ నిర్మాణ ప్రాంతాన్ని చూపుతున్న కార్పొరేటర్ సత్యబాబు

కోడిపందేలు నిర్వహించటం, పాల్గొనడం నేరం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని చిల్లకల్లు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల అభివృద్ధి అధికారి జి.నితిన్ మాట్లాడుతూ కోడి పందేలు నిర్వహించేవారిపై సెక్షన్ 10-ఆంధ్రప్రదేశ్ గేమింగ్ యాక్ట్ 1974, సెక్షన్ 34 జంతుహింస నివారణ చట్టం, 1960 ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో విస్తరణాధికారి, చిల్లకల్లు ఎస్సై, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కౌలు చెల్లించాలని రైతుల ఆందోళన

ఆందోళన చేస్తున్న విమానాశ్రయ విస్తరణ రైతులు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం ఎయిర్ పోర్ట్ విస్తరణకు, భూములిచ్చిన రైతులకు పెండింగ్ కౌలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం విమానాశ్రయం ఎదుట ఐటీ పార్క్ రోడ్డులో ఆందోళన జరిపారు. గన్నవరం విమానాశ్రయ విస్తరణకు కేసరపల్లి అజ్జంపూడి, బుద్ధవరం, అల్లాపురం, చిన్న అవు టపల్లి గ్రామాల నుండి 2015 లో 850 ఎకరాలు తీసుకున్నట్లు తెలిపారు. దీనికి ప్రతి ఫలముగా అమరావతి రాజధానిలో ఒక ఎకరమునకు 1450 చదరపు గజాలు ఇచ్చారని, కొంతమందికి ఇంకను కొంతమందికి లాటరీ కూడా తీయలేదనీ ప్లాట్లు కూడా రిజిష్టరు చేయలేదన్నారు. మిగతా వారికి కూడా లాటరీ తీసి ప్లాట్లు రిజిష్టరు చేసి ప్లాట్లు అభివృద్ధి చేసి వాటికి మౌళిక సదుపాయములు కల్పించి రైతులకు ఇవ్వాలన్నారు. అదేవిధంగా 1-9-2015 నుండి రావలసిన వార్షిక కౌలు పైకము పది సంవత్సరాలకు సుమారు రూ.10 కోట్లు వరకు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమం లో రైతులు, ప్లాట్లు కోల్పోయిన వారు పాల్గొన్నారు.

హెల్త్ కార్డ్స్ ఇవ్వాలి.. శంకరావు, రైతు

అమరావతి రైతులకు ఇచ్చినట్టే! ' హెల్త్ కార్డ్స్ మా రైతులందరికీ ఇప్పించాలి. రైతులకు కౌలు. సిఆర్డిఏ ద్వారా ఆన్లైన్ పేమెంట్ చేయాలి. ఆరు ఏళ్ళుగా నగదు పెండింగ్ పెట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి. ముఖ్యంగా తమకు కేటాయించిన సి ఆర్ డి ఏ లోని ప్లాట్లను శుభ్రం చేసి అభివృద్ధి చేయాలి.

రైతుల బాధను అర్థం చేసుకోవాలి నాయని ప్రభాకర్ రావు, రైతు,

గన్నవరం విమానా శ్రయ విస్తరణకు భూములిచ్చిన రైతులు బాధలను అర్థం చేసు కోవాలి. ఏళ్ల తరబడి ప్లాట్లు రాలేదు. కౌలు పరిస్థితి అలాగే ఉంది. కొంత మందికి ప్లాట్లు ఇచ్చారు అనుకుంటే కౌలు పడటం లేదు. మా కష్టాలు చెప్పలేం. నాలుగు ఎకరాలు ఇచ్చాం. కౌలు రూ. 13లక్షలు రావాలి.

సీఎం స్పందించాలి, ఎం. వి. ఎల్. ప్రసాద్, రైతు,

కౌలు పెండింగ్ సమస్య పై సీఎం స్పందించాలి. ఆరు ఏళ్ళుగా డబ్బులు రాలేదు. గత పాలకులు పట్టించు కోలేదు. నిజం చెప్పాలంటే రైతులకు అన్యాయం చేశారు. కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుందని భావిస్తున్నాం.

కలెక్టర్‌తో ఎంఎల్‌ఎ కాగిత కృష్ణప్రసాద్, ప్రతినిధులు

కలంకారీ క్లస్టర్ ఏర్పాటుకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : పెడనలో కలంకారీ క్లస్టర్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డికే బాలాజీ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లో పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పెడన కలంకారీ ఆర్టిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ ను కలిసి పెడనలో ఏర్పాటు చేయనున్న కలంకారి క్లస్టర్ గురించి చర్చించారు.ఈ నెల రెండో తేదీన జిల్లా కలెక్టర్ పెడనలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించగా ఎంఎల్ఏ ఆధ్వర్యంలో కలంకారి ఆర్టిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కలిసి క్లస్టర్ ఏర్పాటుకు సత్వర చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్లస్టర్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆర్ వెంకట్రావును ఆదేశించారు.

'విద్యావికాస్'లో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-గుడివాడ : సంక్రాంతి సంబరా లలో భాగంగా విద్యావికాస్ పాఠశాలలో ముత్యాల ముగ్గులు పోటీలు నిర్వహించారు. బుధవారం స్థానిక బైపాస్ రోడ్డులోని విద్యావికాస్ పాఠశాల ఆవరణలో సంక్రాంతి సంబరాలలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులతో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు ముప్పాళ్ళ సుబ్బారావు, కొమ్మినేని సాంబశివరావులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగ మన సంస్కృతి సాంప్రదాయాలతో పాఠశాలలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేకంగా ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అంద జేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-బంటుమిల్లి : ఎలక్ట్రికల్ యూనియన్ సమా వేశాలు తంటిపూడి రాజశేఖర్ అధ్యక్షతన బుధవారం పునః ప్రారంభం అయ్యాయి. ఈ సమావేశాల్లో నూతన కమిటీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా లంకదాసుల అజయ్ గోష్, కార్యదర్శిగా పోగోలు రవి, కోశాధికారిగా తంటిపూడి రాజశేఖర్, గౌరవ అధ్యక్షులుగా మాజేటి శివ శ్రీనివాసరావు ను ఎన్నుకున్నారు. మెంబర్లుగా పోనాల బసవయ్య, సుధాకర్, అమత రాజు, ఈదనాని, కొరగంటి ప్రసాద్, యంపాసతీష్, పరసా సాయికుమార్ ని వీరు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 40 సంవత్సరాల క్రితం బంటుమిల్లిలో భవన నిర్మాణ కార్మికుల యూనియన్ స్థాపించిన సీనియర్ ఎలక్ట్రికల్ మేస్త్రి వంగల రాజుకి నూతన కమిటీ వారు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో కృష్ణా జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూని యన్ నాయకులు కొమ్మలపాటి రవి తదితర ఎలక్ట్రికల్ కార్మికులు పాల్గొన్నారు

పదిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి : డిఇఒ

మాట్లాడుతున్న డిఇఒ రామారావు

ప్రజాశక్తి-ఉయ్యూరు : పదవతరగతి పరీక్ష ల్లో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే రామారావు అన్నారు. ఉయ్యూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రభుత్వ, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సమావేశం నిర్వహిం చారు. పదవతరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో వివిధ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్న విద్యార్థులను గు ర్తించి ఆయాసబ్జెక్టుల ఉపాధ్యా యులతో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక క్లాసులు నిర్వహించి విద్యార్థులలో నమ్మకం కలిగించాలన్నారు. పాఠశాలల్లో మౌళిక సౌకర్యాల కల్పనకు ముందుకువచ్చే దాతలను ప్రోత్సహించి పాఠశాల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. డీసీఈబీ సె క్రటరి ఎస్కే జాన్సాహెబ్, డీవైఈఓ జి పద్మారాణి పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సంఘం కేలండర్ ఆవిష్కరణ

కేలండర్ ఆవిష్కరిస్తున్న బుద్ధప్రసాద్

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఆంధ్ర ప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం 2025 కేలండర్ను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ఆవిష్కరించారు. బుధవారం ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు జి గోపీచంద్ ఆధ్వర్యంలో గ్రామ సచివాలయ సంఘం నాయకులు ఎమ్మెల్యేను ఆయన స్వగృహం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షులు కే సాయిబాబు, ట్రెజరర్ కే నవీన్ జిల్లా జాయింట్ సెక్రెటరీ వేమూరి లావణ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రావణ కుమార్, చల్లపల్లి మండల నాయకులు వి సురేష్, జి నరేష్, బి రాజ్యలక్ష్మి, సిహెచ్ సుజని పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం కార్మికుల వినతి

ప్రజాశక్తి-చల్లపల్లి : ఇంటర్మీడియట్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథక నిర్వహణ ఇప్పటికే పాఠశాలలో పథకం బాధ్యతలు నిర్వహిస్తున్న కార్మికులకే బాధ్యతలని అప్పగించాలని, ప్రైవేట్ సంస్థలకు అప్పగించవద్దని కోరుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారి 2. పరిశే వెంకటేశ్వరరావుకు మంగళవారం వినతిపత్రం అందించారు. వినతి పత్రం సమర్పించిన వారిలో మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ చల్లపల్లి మండల అధ్యక్ష, కార్యదర్శులు మద్దాల నాగరాణి, గొరిపర్తి వేణుగోపాలమ్మ, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఒడుగు గంగాధర్, సిఐటియు చల్లపల్లి మండల అధ్యక్ష కార్యదర్శులు చల్లపల్లి గంగాభవాని, మహమ్మద్ కరిముల్లా, మధ్యాహ్న భోజన కార్మికులు నందం వెంకటేశ్వరమ్మ, జి కమల, పి వాణి ,అంకం పద్మ, ఎం అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి-పమిడిముక్కల : మినుము పంట పల్లాకు తెగులుకు ఎకరానికి 100 మిల్లీమీటర్ల ఇమిడో క్లోఫిడ్ చల్లాలని పమిడిముక్కల వ్యవసాయాధికారి గణేష్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అయినం పూడి, కపిలేశ్వరపురంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సస్యరక్షణ పద్ధతుల వలన పంట మేలైన దిగుబడిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వివి ఫార్మసీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : అంకిత భావం, క్రమశిక్షణ శ్రమతో కూడిన కృషిని ఆయు ధంగా చేసుకుని ఉన్నత స్థాయిలో విద్యార్థులు ఎదగాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ లక్ష్మణరావు కోరారు. స్థానిక వివి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసిటికల్ సైన్సెస్ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగాయి. ఈ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం సీనియర్స్ కి జూనియర్స్ కి మధ్య స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పాలని ఉద్దేశ్యంతో నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. సీనియర్స్ జూనియర్స్‌కి తమ విలువైన సూచనలను సలహాలను అందించి వారికి సరైన మార్గం నిర్దేశించాలని కోరారు. విద్యార్థులంతా ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని అంకితభావం క్రమశిక్షణ శ్రమతో కూడిన కఠిని ఆయుధాలుగా చేసుకొని ఆ లక్ష్యాన్ని చేదించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఈ కార్యక్రమం బీఫార్మసీ రెండవ సంవత్సరం చదువుతున్న రోహిణి సాంప్రదాయక నత్యంతో ఆరంభించారు. తరువాత మొదటి, రెండవ సంవత్సర విద్యార్థుల సాంస్కతి కార్యక్రమాలు అందరినీ అలరించాయి. చివరగా జూనియర్ విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్‌తో పాటు అధ్యాపకులు డాక్టర్ ఎస్.కె. అమినాబీ, డాక్టర్ పి.రవిష, డాక్టర్ టి. ప్రశాంతి, డాక్టర్ టి. బాలకష్ణ పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-గూడూరు : గూడూరు మండలం గూడూరు గాంధీ బొమ్మ సెంటర్లో ఈనెల 13, 14, 15 తారీకుల్లో సంక్రాంతి సందర్భంగా మహిళలకు, యువతకు ముగ్గుల పోటీలు, లెమన్ స్పూన్, స్లో సైక్లింగ్ మరియు పిల్లలకు డాన్స్ బేబీ డాన్స్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తున్నట్లు గూడూరు డిసీ చైర్మన్ పోతన స్వామి తెలిపారు. ఈ కార్యక్రమాలు ప్రతిరోజు మధ్యాహ్నం మూడు గంటల నుండి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో గెలిచిన వారికి నగదు బహుమతులు పంపిణీ చేస్తామని, మండలంలోని మహిళలు, యువత ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోతన రామోజీ, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి ఎస్ ఏ బేగ్, బిజెపి మండల పార్టీ అధ్యక్షులు కొలపల్లి రజిని పాల్గొన్నారు.

జర్నలిస్టు ఇళ్ల స్థలాల కోసం కృషి చేయాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని శుభమస్తు ఫంక్షన్ హాల్‌లో బుధవారం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో జర్నలిస్టు యూనియన్ల నాయకులు టీఎన్ఎల్ ఆచార్యులు, కాకరపర్తి రమేష్, సీనియర్ జర్నలిస్టు యలదండి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ జర్నలిస్టుల చిరకాల కోరిక అయిన ఇళ్ల స్థలాలు ఇప్పించాలని, ఇతర సమస్యలను తెలిపారు. ఈ సందర్భంగా పెద్దలు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు నాల్గొవ స్తంభంగా పిలువబడే పాత్రికేయ రంగం ఎంతో విలువలతో కూడిన మరియు కత్తి మీద సాము వంటిదని అన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ప్రభుత్వ పరంగా కేటాయించేందుకు కృషి చేస్తామని తెలిపారు. జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాలకు చెందిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆకస్మిక దాడులు

ప్రజాశక్తి - నందిగామ : ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విజయవాడ వై.శ్రీనివాస చౌదరి ఆదేశాల మేరకు కె.వి.సుధాకర్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో సిబ్బంది నందిగామ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల పెద్దవరం గ్రామంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రామిశెట్టి రాము, శెట్టి.వెంకట రమణ అనే వ్యక్తులకు చెందిన 173 తెలంగాణ మద్యం బాటిళ్లను స్వాధీన పరుచుకొని, కేసులు నమోదు చేసి స్టేషన్‌కి అప్పగించారు. ఈ దాడుల్లో సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఐ రామ శేషయ్య, సుబ్బారావు వారి సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు.

రాంప్రదీప్‌కు డిఇఒ అభినందనలు

ప్రజాశక్తి - తిరువూరు : విద్యార్థులలో దేశభక్తి, సోదరభావం పెంచడానికి భారత దేశం నా మాతభూమి జాతీయ ప్రతిజ్ఞ రచించిన పైడిమర్రి వెంకట సుబ్బారావు జీవిత చరిత్రను రాయడమేగాకుండా, ప్రతిజ్ఞ సందేశా న్ని ప్రజలలోకి తీసుకెళ్లడానికి విశేష కృషి చేస్తున్న ఇంగ్లీష్ రిసోర్స్ పర్సన్ ఎం.రాం ప్రదీప్ ను ఎన్టీఆర్ జిల్లా డిఈఓ యువి.సుబ్బారావు అభినందించారు. బుధవారం విజయవాడలోని కెబి సి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈఎండిపి శిక్షణా కార్యక్రమానికి హాజరైన రాం ప్రదీప్ తాను రాసిన పైడిమర్రి జీవిత చరిత్రను డిఇఒకు అందజేశారు. భాగంగా ప్రతిజ్ఞ పాఠ్యపుస్తకాల్లో చేరి 60ఏళ్ళు అయిన సందర్భంగా పైడిమర్రికి తగిన గుర్తింపు తీసుకొని రావడానికి కృషి చేయాలని రాం ప్రదీప్ డిఈఓను కోరారు.

వెయ్యి లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు ఎక్సైజ్ సర్కిల్లో కాపుసారా నిరోధానికి బుధవారం అధికారులు విస్తృత దాడులు నిర్వహించారు. విస్సన్నపేట మండలం తాతకుంట్ల తండాలో 500 లీటర్ల బెల్లపు ఊటను డ్ర మ్ముల్లో నిల్వ చేసినట్లు గుర్తించిన అదికారులు ఏ.కొండూరు మండలంలో మరో 500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. తెలంగాణా మద్యం రవాణా చేస్తున్న ఇరువురు వ్యక్తులను అరెస్టు చేసి వారినుంచి రెండు ద్విచక్రవాహనాలు, మద్యం సీసాలు స్వాధీనపరచుకున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

పాఠశాల అభివృద్ధికి విరాళాలు

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు బుధవారం విరాళాలు అందజేశారు. ప్రవాసాంధ్రుడు తోట సురేష్ రూ.10,116, కాంట్రాక్టరు ముత్యాల మధుసూదన రావు రూ.5వేలు పాఠశాలలో సైకిల్ స్టాండ్ నిర్మాణ నిమిత్తం అందజేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయుడు శంకరరావు, పూర్వ విద్యార్థులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపివి పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : కొత్తగా వ్యాపిస్తున్న 'హెచ్ఎంపివి (హ్యూమన్ మెటానిమో)' గురించి అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు డాక్టర్ సందేశ్, డాక్టర్ మణిబాబు తెలిపారు. ఈ వైరస్ కోవిడ్ -19 ఫ్లూ, ఇతర శ్వాసకోస రుగ్మతలను పోలివుంటుందన్నారు. జ్వరం, దగ్గు, ముక్కుకురాటం, గొంతునొప్పి వంటివి ఉంటాయని, ఇన్ఫెక్షన్ సోకిన '6' రోజుల్లో రోగలక్షణాలు బయటపడతాయని తెలిపారు. వైరస్ తీవ్రత ఎక్కువగా వున్నవారిలో బ్రాంకైటీస్, నిమోనియాకు దారితీయవచ్చు. వ్యాధి సోకిన వారికి, వైరస్ సోకిన వారికి సన్నిహితంగా మెలగటం వలన ఈ వ్యాధి ఇతరులకు, వ్యాపిస్తుందని వైద్యాధికారి తెలిపారు. మండల ప్రజలకు ఈ వైరస్ రాకుండా క్రింద ఇచ్చిన సూచనలు పాటించాలనీ డాక్టర్ సందేశ్ తెలిపారు. అందరు విధిగా మాస్కులు ధరించాలని, చేతులను తరచు సబ్బునీటితో, శానిటైజర్‌తో శుభ్రం చేసుకోవాలని తెలిపారు. 12 సంవత్సరాల లోపు పిల్లల్లో, వ్యాధి నిరోధక శక్తి, తక్కువగా ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలన్నారు.

గంజాయి, రెండు కార్లు స్వాధీనం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామలో రూ.25 లక్షల విలువ చేసే గంజాయి, రెండు కార్లను నందిగామ సబ్ డివిజన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం నందిగామ ఎసిపి కార్యాలయంలో 200 కేజీలు గంజాయి, రెండు కార్లను విలేకరుల సమావేశంలో బహిరంగ పరిచారు. విజయవాడ డిసిపి మహేశ్వర రాజు మాట్లాడుతూ పక్క సమాచారంతో పోలీస్ నిఘా పెట్టగా గంజాయి వాహనాలను గుర్తుతెలియని వ్యక్తులు వదిలి వెళ్లారని తెలిపారు. విజయవాడ సిపి రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు అందిన సమాచారం ప్రకారం కీసర టోల్ ప్లాజా వద్ద, గట్టు భీమవరం టోల్ ప్లాజా వద్ద వహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఈ వాహనాల తనఖీల్లో ఒక వాహనం కీసర టోల్‌ప్లాజా వద్ద తప్పించుకొని హైదరాబాద్ వైపు వెళ్తుండగా డ్రోన్ కెమెరా ఉపయోగించి గట్టు భీమవరం వద్ద అడ్డగించేందుకు ప్రయత్నించగా కారును యు టర్న్ తీసుకుని నిందితులు గౌరవరం వద్ద పోలాలలో వదిలి పరారీ అయినట్లు తెలిపారు. అనంతరం కారును తనిఖీ చేయగా కారులో 80 కేజీల గంజాయి దొరికినట్లు తెలిపారు. అయితే రెండో కారు కీసర టోల్ ప్లాజా దాటిన తరువాత నందిగామ పరిసర ప్రాంతాల్లో కనిపించకుండా పోయిందని, దీనిని హైవేపై ఉన్న సిసి కెమెరాలు, డ్రోన్‌ల సహాయంతో అంబారుపేట దగ్గర రియల్ ఎస్టేట్ వెంచర్‌లో ఉన్నట్లు తెలుసుకుని అక్కడికి వెళ్లినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నందిగామ ఎసిపి ఎబిజీ తిలక్, నందిగామ పట్టణ సిఐ వైవిఎల్ నాయుడు, నందిగామ ఎంఆర్ఓ సురేష్ బాబుతో వెళ్లి పరిశీలించగా కారులో సుమారు 120 కేజీల గంజాయి దొరికినట్లు తెలిపారు. రెండు కార్లలో ఉన్న నిందితులు పరారీ అయినట్లు తెలిపారు. ఇప్పటికే నిందితులను పట్టుకునేందుకు నాలుగు టీంలను ఏర్పాటు చేసినట్లు డిసిపి తెలిపారు. ఈ సమావేశంలో నందిగామ సిఐ నాయుడు, నందిగామ రూరల్ సిఐ చవాన్, జగ్గయ్యపేట సిఐ వెంకటేశ్వరరావుతో పాటు చందర్లపాడు ఎస్ఐ దుర్గ మహేశ్వరరావు, నందిగామ ఎస్ఐ అభిమన్యు, జగ్గయ్యపేట ఎస్ఐ వెంకటేశ్వరరావు, చిల్లకల్లు, వత్సవాయి, పెనుగంచిప్రోలు ఎసైఐలు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, సీజ్ చేసిన కార్లు

విద్యుత్ భారాలపై సిపిఎం నిరసనలు

తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూ ప్రగల్భాలు పలికి నేడు అధికారంలోకి వచ్చి ఆరుమాసాల్లోనే కూటమి ప్రభుత్వం ప్రజల నడ్డి విరిచిందని పలువురు విమర్శించారు. విద్యుత్ ఛార్జీల మోత మోగిస్తూ మాట తప్పిందని ఎద్దేవా చేశారు. ఈ నేపథ్యంలో పలుచోట్ల సిపిఎం ఆధ్వర్యంలో నిరసనలు, విద్యుత్ బిల్లుల దహనం కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలు ఈ నిరసనల్లో పాల్గొని విద్యుత్ ఛార్జీల భారాలను తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రజాశక్తి వత్సవాయి : విద్యుత్ భారాలు పెంచబోమంటునే టిడిపి ప్రభుత్వం ఆరు నెలల కాకముందే ప్రజలపై 17వేల కోట్లు విద్యుత్ భారాన్ని పెంచిందనీ సిపిఎం నాయకులు విమర్శించారు. ఈ మేరకు బుధవారం వత్సవాయి సచివాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు తమ్మినేని రమేష్, కంచర్ల కొండయ్య, తమ్మినేని రాంబాబు, కె.నాగరాజు, పి.కోటేశ్వరరావు, ఆర్.వెంకట్, వెంకటేశ్వర్లు, కోటయ్య, అప్పారావు పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం :** ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్లో జరిగిన నిరసన కార్యక్రమంలో సిపిఎం కొండపల్లి పట్టణ కార్యదర్శి యం మహేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం టౌన్ కమిటీ సభ్యురాలు కె బేబీ సరోజిని, ఇ.కొండలరావు, షేక్ బాషా, సిపిఎం శాఖ కార్యదర్శి జి.రమణమ్మ, సభ్యులు లైలా రామారావు, అంజలి, నవీన్ హాకర్స్, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు. **మైలవరం :** మైలవరంలోని తారక రామా నగర్లోసిపిఎం పార్టీ పట్టణ కమిటీ సభ్యురాలు షేక్ మై భూబీ ఆధ్వర్యంలో బుధవారం సర్దుబాటు చార్జీలతో పెదలపై మోపిన భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేస్తూ కరెంట్ బిల్లులను దహనం చేశారు. సిపిఎం మండల కార్యదర్శి సిహెచ్.సుధాకర్, ఆశ, నాగమల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు. **విస్సన్నపేట :** స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లో విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు. సిపిఎం మండల కార్యదర్శి నాగరాజు అన్నారు. కార్యక్రమంలో ఆకుల శ్రీనివాసరావు జి.రాము పాల్గొన్నారు. **వీరులపాడు :** వీరులపాడు గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు వట్టికొండ పార్థసారది, కోడూరు .పిచ్చేశ్వరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి చాట్ల రవి, మండల కమిటీ సభ్యులు గడ్డం ప్రభాకర్ పాల్గొన్నారు **రెడ్డిగూడెం :** విద్యుత్ ఛార్జీల భారాలను తగ్గించాలని సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం శాఖ కార్యదర్శి అప్పిరెడ్డి, మండల కమిటీ సభ్యులు ఉయ్యూరు కృష్ణారెడ్డి, మోహనరెడ్డి పాల్గొన్నారు కూనపరాజు పర్వ గ్రామంలో సిపిఎం కూనపరాజుపర్వ గ్రామ శాఖ ఆధ్వర్యంలో బిల్లులను తగలబెట్టారు. సిపిఎం శాఖ కార్యదర్శి కాంతారావు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో శాఖ సభ్యులు పాల్గొన్నారు. **తిరువూరు :** సిపిఎం ఆధ్వర్యంలో బోసుబొమ్మ సెంటర్‌లో అందోళన చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నాగేంద్ర ప్రసాద్ మాట్లాడారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు కరెంటు చార్జీలు పెంచబోమని అధికారంలోకి వచ్చాక ప్రజలపై విపరీత మైన బారాల మోపుతూ కరెంటు ఛార్జీలు పెంచడం సిగ్గుచేటన్నారు. గుళ్లపల్లి వెంకటరత్నం, పంతంగి శ్రీనివాసరావు, నూకల సత్యనారాయణ, ఎస్‌వి భద్రం, ముఠా, ఆటో కార్మి కులు పాల్గొన్నారు.

కొండపల్లిలో నిరసన తెలుపుతున్న దృశ్యం(ఇబ్రహీంపట్నం)

మైలవరంలో బిల్లులు దహనం చేస్తున్న మహిళలు

రెడ్డిగూడెంలో బిల్లులు దహనం...

తిరువూరులో ఆందోళన ...

విస్సన్నపేటలో బిల్లులు దహనం చేస్తూ...

వత్సవాయిలో సచివాలయం వద్ద ఆందోళన...

వీరులపాడులో...

మత్స్యకారుల జీవనోపాధికి ప్రభుత్వం చర్యలు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : మత్స్యకారుల జీవనోపాధికి ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. మత్స్యకార కుటుంబాలకు జీవనోపాధి కోసం కృష్ణానదిలో భారీసంఖ్యలో చేప పిల్లల్ని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద ఎంఎల్ఎ బుధవారం గంగ పుత్రులతో కలసి చేప పిల్లలను కృష్ణానదిలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ కృష్ణానదిలో మత్స్య సంపదను పుష్కలంగా పెంపొందించే క్రమంలో ప్రతి ఏడాది మత్స్యశాఖ ద్వారా చేప పిల్లలను విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ చేపల ఉత్పత్తి స్థానికంగా చేపల వినియోగాన్ని పెంచుతుందన్నారు. ఎక్కువ పోషక విలువలు కలిగిన చేప ఆహారంగా లభిస్తుందన్నారు. తాజాగా 7.5 లక్షల చేప పిల్లలను కృష్ణానదిలో విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. 7.5 లక్షల చేప పిల్లలలో సుమారు 70 శాతం బతుకుతాయని అన్నారు. 70 శాతం బతికితే 5.25 లక్షల చేప పిల్లలు '7' నెలల్లో 5.25 లక్షల కేజీలుగా ఎదుగుతాయన్నారు. దీని ద్వారా ఒక కేజీ చేప రూ.100 అయితే రూ.5.25 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. తద్వారా మత్స్యకార రంగంపై, చేపల వేటపై ఆధారపడిన సుమారు 5 వేల మత్స్యకారులకు జీవనోపాధి లభిస్తుందన్నారు. ఇబ్రహీంపట్నం ఫెర్రి వద్ద ఫిష్ మార్కెట్ నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు. పవిత్ర సంగమం పూర్వ వైభవానికి కషి చేస్తున్నట్లు వెల్లడించారు. కొండపల్లి మున్సిపాలిటీకి త్వరలో పాలకవర్గం ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

మైలవరం ఎంఎల్ఎ వసంత వెంకట కృష్ణ ప్రసాద్

చేప పిల్లలను నదిలో వదులుతున్న ఎంఎల్ఎ వసంత, తదితరులు

ఫిర్యాదుల మేరకే పింఛన్ల పరిశీలన

ప్రజాశక్తి - గంపలగూడెం: మండల వ్యాప్తంగా పక్షవాతం (పెరాలసిస్) వ్యాధితో ఇబ్బంది పడుతూ పింఛన్లు పొందుతున్న వివిధ గ్రామాలలో ఫిర్యాదులు అందినట్లు గంపలగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ శృతి తెలిపారు. వినగడప, కనుమూరు, తోటమూల, గంపలగూడెం, పెద్ద కొమెర, గోసవీడు, మేడూరు, రాజవరం, లింగాల గ్రామాలు బుధవారం ప్రత్యేక డాక్టర్ల బందం పర్యటించింది. ప్రభుత్వ ఆదేశాల మేర జరిగిన ఈ పర్యటనలో మొత్తం 27 మందిని పరిశీలించినట్లు చెప్పారు. ఈ పింఛన్లు అందుకుంటున్న లబ్ధిదారులు వీల్ చైర్ లేదా మంచంలో మాత్రమే ఉండి ఉండాలన్నది కొసమెరుపు. కానీ గ్రామాల్లో అనేకమంది రోజువారి పనులు చేసుకునే వారు సైతం ఈ పింఛన్ అందుకుంటున్నట్లు సమాచారం.

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని ఆందోళన

ఉయ్యూరులో ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

గుడివాడలో ధర్నా చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు పట్టణం ప్రజల గహాలకు విద్యుత్తు స్మార్ట్ మీటర్లు బిగిస్తే సిపిఎం పార్టీగా దశలవారీగా పోరాటాలు చేస్తామని సిపిఎం పట్టణ కార్యదర్శి బి రాజేష్ అన్నారు. బుధవారం పట్టణంలోని 12వ వార్డులో విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కరపత్రాలు పంపిణీ చేశారు. ట్రూ అప్ ఛార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీలు అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారని విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి కీర్తి, పడాల లక్ష్మణరావు, సిపిఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** ప్రతినెలా పెరుగుతున్న విద్యుత్ ట్రూఅప్ ఛార్జీలతో సామాన్యులు సతమతమవుతున్నారని సిపిఎం సీనియర్ నాయకులు నీలం మురళీకష్ణారెడ్డి అన్నారు. స్థానిక ఏలూరు రోడ్డులోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద బుధవారం ఉదయం వామ పక్షాల ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఆయన ప్రసంగిస్తూ అదానీతో కుదుర్చుకున్న అన్ని ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గుడివాడ సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి, సీపీఐ నాయకులు చింతలూరు సత్యనారాయణ, కొమ్మలసురేష్, షేక్మాసా, సిపిఎంసభ్యులు, సురేంద్ర, విజయ్కుమార్, ఎస్సయ్య, ఎ.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

12న ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-ఉయ్యూరు : వంశీరాయల్ సిటీ ఆధ్వర్యాన సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్టు సుధీర్ టింబర్, వంశీగ్రూప్ అధినేత నూకల సాం బశివరావు తెలిపారు. బైపాస్ రోడ్డులో శ్రీవిశ్వశాంతి స్కూల్ సమీపాన వంశీరాయల్ సిటీలో బుధవారం ముగ్గుల పోటీల పోస్టర్ను స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలసి ఆవిష్కరించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళలకు వంశీరాయల్ సిటీ ఆవ రణలో పెద్దయెత్తున ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పోటీల్లో విజేతల కు ప్రధమ బహుమతిగా రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు, తతీయబ హుమతి రూ. 5 వేలు, మరో పదిమందికి కన్సోలేషన్ బహుమతులు అందచేస్తామన్నారు. తల్లం హ నుమంతరావు, ఇస్మాయిల్, నేరెళ్ల తేజ, లయన్స్, సత్తార్, రోటరీ, వాసవీ క్లబ్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఏజీఅండ్ ఎస్ జి ఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం వృద్ధులు, పేదలకు దుప్పట్లు పంపిణీచేశారు. ప్రస్తుతం చలి పెరిగి, మంచు దట్టంగా కమ్ముతున్న పరిస్థితుల్లో రోడ్లపక్కన నిద్రించేవారు, పేదలు, వృద్ధులను చలినుంచి కొంతవరకైనా రక్షణ కల్పించాలన్న ఉద్దేశంతో దుప్పట్లు పంపిణీచేశామని అసోసియేషన్ అధ్యక్ష, కార్య దర్శులు సత్తార్, పూర్ణచంద్రరావు అన్నారు. పలువురు కార్యవర్గ సభ్యులు, అసోసియేష న్ సభ్యులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

ముగిసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి-కంకిపాడు : గత రెండు రోజులుగా పోరంకి మురళి రిసార్ట్స్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ముగిసింది. ఈ కార్యక్రమంలో బహుమతి ప్రదానోత్సవం ఎస్‌సిఆర్‌టి డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి శ్రీనివాస్‌రావు విచ్చేసి బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రదర్శించిన ప్రయోగాలను వీడియోలు చేసి ప్రతి పాఠశాలకు పంపే విధంగా ప్లాన్ చేస్తున్నామన్నారు. వ్యకిగత విభాగం నుంచి 15, గ్రూపు నుంచి 10, టీచర్స్ ఎగ్జిబిట్స్ నుంచి 10 అత్యంత అద్భుత ప్రదర్శనలు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో కంకిపాడు, పెనమలూరు మండల ఎంఈవోలు పాల్గొన్నారు.

బహుమతులు అందిస్తున్న దృశ్యం

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-బంటుమిల్లి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. జగన్ మోహన రావు సారధ్యంలో ఏర్పాటు చేసిన ఈ సంక్రాంతి సంబరాలు కళాశాల గ్రౌండ్లో ఘనంగా జరిగాయి. కంప్యూటర్స్ అధినేత డాక్టర్ సత్య రాజేష్ ఈ వేడుకలకు స్వాగతం పలికారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ జగన్ మోహనరావు మాట్లాడుతూ సంక్రాంతి సంబరాల నేపథ్యంలో ఐక్యమత్యత, ఆత్మీయత, అనురాగం, ప్రేమానుబంధాలు కనిపిస్తాయని అన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ గాయకుడు, రాష్ట్ర గుర్తింపు పొందిన ప్రజా గాయకుడు సూరగం రామకష్ణ ప్రత్యేకమైనటువంటి గీతాలు ఆలపిస్తూ విద్యార్థులను ఉర్రూతలూగించారు. కోఆర్డినేటర్, కామర్స్ శాఖాధిపతి ఆర్ హిమాలినీ దేవి సారధ్యంలో విద్యార్థిని విద్యార్థులు భోగి మంటలు వేసి కోలాట ప్రదర్శన చేశారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కతిక కార్యక్రమాలు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. ఈ సంక్రాంతి సంబరాల్లో వైస్ ప్రిన్సిపాల్ బి.దేవజయ రాజు,ఎన్‌ఎస్-ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్. జిబి ఆనంద కుమార్, జ్యోత్స్న,సుజాత, రత్న, చలంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

హామీలు అమలు చేయాలని నిరసన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం వాలంటీర్లు అందరినీ విధుల్లోకి తీసుకోవాలని, వాలంటీర్లు అందరికీ పదివేల రూపాయలు వేతనం ఇవ్వాలని కోరుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని కవుతరం గ్రామం బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కోటప్రోలు నాగు , పడమటి సుజాత , పోస్టల్ రాజు, ఈడే ప్రసాద్ , గద్దేటి ప్రసన్న , సింగవరపు సన్నీ, బాబిరెడ్డి రాజేష్ చిన్నం నాని తదితరులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-గన్నవరం : గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఇళ్ల స్థలాలకు అణువుగా ఉండే ప్రభుత్వ భూములు ఎక్కడా లేవని, ప్రభుత్వం గ్రామాల్లో పట్టా భూములు కొనుగోలు చేసి పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ తెలియజేశారు. గన్నవరం నియోజకవర్గం అల్లాపురం గ్రామంలో దళితుల కాలనీలో ఇళ్ల స్థలాల కోసం నిర్వహించిన ప్రచారంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు తూతూ మంత్రంగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పడం సరికాదని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు లేని ప్రాంతాల్లో కచ్చితంగా పట్టా భూములు కొనుగోలు చేసి ఇళ్ల స్థలాలకు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గన్నవరం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ నాయకులు కొండా వీరస్వామి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కాపు సంక్షేమ భవనం నిర్మాణం చేపట్టాలని వినతి

ప్రజాశక్తి-కోడూరు : కోడూరులో కాపు సంక్షేమ భవనం నిర్మాణం చేపట్టాలని కాపు సంఘ నేత, జనసేన నాయకులు బడే వెంకటేశ్వరరావు కోరారు. బుధవారం ఈ విషయంపై అవనిగడ్డ నియోజకవర్గం ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కు వినతి పత్రం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోట రంగరాజ పెరుమాళ్ళు, బడే మధు, జరుగు నారాయణ రావు, బండె గోపాలకష్ణ, వర్ధినీడు వెంకటేశ్వరరావు, కూనపరెడ్డి లక్ష్మణ, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన రంగవల్లుల పోటీలు

ప్రజాశక్తి - గుడివాడ : షా గులాబ్ చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో ఫ్రెండ్స్ ప్రోగ్రెసివ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ధూళిపాళ్ళ శేషగిరి జ్ఞాపకార్థం కొడాలి విజయభారతి స్మారక రంగవల్లులు పోటీలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లయన్స్ క్లబ్ సంఘమిత్ర అధ్యక్షురాలు ఉప్పలపాటి ఝాన్సీలక్ష్మి, విశిష్ట అతిథిగా వాసవి క్లబ్ వనిత విధర్భపురి అధ్యక్షురాలు చలువాది లక్ష్మీసురేఖ పాల్గొన్నారు. మాంటిసోరి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ గాంధీ మున్సిపల్ హై స్కూల్ తదితర పాఠశాలలకు చెందిన 20.మంది విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఫ్రంట్ కన్వీనర్ డిఆర్‌కె ప్రసాద్, వాసవి క్లబ్ సభ్యులు గాదే మోహన్‌బాబు, గ్రంథాలయ అధికారి బేరం వెంకటరమణ పాల్గొన్నారు.

బహుమతులు అందిస్తున్న విద్యార్థినీలు

ప్రకృతి వైపరీత్యాలకన్నా ప్రభుత్వ వైఫల్యాలతోనే రైతులకు నష్టం : గౌతం

ప్రజాశక్తి-అవనిగడ్డ : ప్రకృతి వైపరీత్యాల కన్నా రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతూ బాధ పడుతున్నారని వైసీపీ అభిమాని యువ నాయకులు బడే గౌతం విమర్శించారు. ఆయన అవనిగడ్డలో విలేకరులతో మాట్లాడుతూ గతంలో వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు నాయుడు మాటల్ని మరోసారి నిజం చేస్తున్నట్లుగా ప్రభుత్వం తీరు ఉందన్నారు. విపరీతంగా పెరిగిన ఎరువుల ధరలతో దిగుబడి మాత్రం అంతంతమాత్రంగా ఉన్నప్పటికీ రైతులు తోలిన ధాన్యానికి ఈ ప్రభుత్వం సకాలంలో డబ్బులు చెల్లించిందని రైతుల ముఖంలో ఆనందాన్ని చూశామని స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పత్రిక ముఖంగా సోషల్ మీడియా వేదికగా చేస్తున్న ప్రకటనలు సిగ్గుచేటు అన్నారు. రైతులు కార్చే కన్నీరు వారికి ఆనంద భాష్పాలు లాగా కనపడు తున్నాయని ఎద్దేవా చేశారు. పొలం వద్దకు వెళ్తే వైరాగ్యం వస్తుందని రైతులు మాట్లాడుకున్నారంటే ఈ ప్రభుత్వ పనితీరు ఏ రకంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : విద్యార్థులు ఆరోగ్యకరమైన ఆహ్లాద భరితమైన పోటీతత్వాన్ని అలవర్చు కోవాలని మాజీ ఎంపీ ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు అన్నారు. వీర్నాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక హిందూ కళాశాలలో బుధవారం నుండి ప్రారంభమైన పోటీలను కొనకళ్ళ నారాయణరావు ప్రారంభించారు. పెడన ఎమ్మెల్యే కాగిత కష్ణ ప్రసాద్, జనసేన పార్టీ నాయకులు బండి రామకష్ణ ఈ కార్యక్రమంలో పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. వీర్నాల ఫౌండేషన్ చైర్మన్ వీర్నాల బాలాజీ మాట్లాడుతూ మూడు రోజులపాటు జరిగే ఈ పోటీల్లో 5500 మంది విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. వివిధ పోటీల్లో బుధవారం 2600 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఒలంపియాడ్, వ్యాసరచన, మ్యాథ్స్, క్విజ్, పోటీలతో బాటు కబాడీ పోటీలు కూడా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డివైఈవో శేఖర్ సింగ్, హిందుకళా శాలాల అనుబంధ సంస్థల కార్యదర్శి డి జి శాస్త్రి, వీర్నాల నాంచారయ్య, మానస, పోతరాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

తంబీ నవదిన ప్రార్ధనలు

ప్రజాశక్తి-ఉంగుటూరు : మానవ మనుగడకు కుటుంబ జీవితం ఎంతో ప్రాముఖ్యం అని డైరెక్టర్ సోషల్ సర్వీస్ సెంటర్ హైదరాబాద్ రెవ ఫాదర్ మాదాను ఆంథోని అన్నారు. జనవరి 13 నుండి 15వరకు జరిగే బ్రదర్ జోసఫ్ తంబి ఉత్సవాల సందర్భంగా జరుపుతున్న నవదిన ప్రార్థనలలో బాగంగా వేళాంగిణి నగర్ సంఘస్తులు, సెయింట్ ఆన్స్ సిస్టర్స్ నిర్వహించిన పూజా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆంథోని పాల్గొని మాట్లాడారు. క్రైస్తవ కుటుంబ జీవితం ఎంతో విలువైనది అని, సమస్యలు వచ్చినప్పుడు కుటుంబ సభ్యులందరూ ఐకమత్యంతో ఎదుర్కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ జోసఫ్ పాలడుగు, విచారణ గురువులు ఫాదర్ అభిలాష్ గోపు, ఇతర సహాయ గురువులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-చల్లపల్లి : తెలుగు దేశం పార్టీ కార్యకర్తలకు భరోసా కల్పిస్తుందని టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు అన్నారు. బుధవారం చల్లపల్లి లోని ఇస్లాం నగర్ లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు మోర్ల శివ, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు షేక్ నబీఘోరీ తదితరులు పాల్గొన్నారు.

'అంబపలుకు' కవితా సంపుటి ఆవిష్కరిస్తున్న ఖాదర్ మొహియుద్దీన్, తదితర ప్రముఖులు

కొత్తదనం కోసం తపించే కవి శ్రీనివాస గౌడ్

'అంబపలుకు' కవితా సంపుటి ఆవిష్కరణలో ఖాదర్ మొహియుద్దీన్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : తనదైన అభివ్యక్తికోసం తపించి, సాధించిన యువ కవుల్లో శ్రీనివాస్ గౌడ్ ఒకరని సుప్రసిద్ధ కవి 'పుట్టుమచ్చ' ఖాదర్ మొహియుద్దీన్ అన్నారు. కవిత్వ భాషకు ఎప్పటికప్పుడు తాజాదనాన్ని అద్దుతుంటేనే కవి కొత్త చిగుర్లు తొడుగుతాడన్నారు. నగరంలోని ఐజిఎంసి స్టేడియంలో జరుగుతున్న 35వ పుస్తక మహోత్సవం ఎనిమిదో రోజు బుధవారం రామోజీరావు సాహిత్యవేదికపై ఐదో కార్యక్రమంగా మల్లెతీగ సాహిత్యసేవాసంస్థ నిర్వహణలో పి. శ్రీనివాస్ గౌడ్ రాసిన 'అంబపలుకు' కవితా సంపుటి ఆవిష్కరణ జరిగింది. దీనిని ఖాదర్ మొహియుద్దీన్ ఆవిష్కరించి మాట్లాడుతూ కవిత్వ భాషను, అందులో తనదైన శైలినీ, బహుళార్థకతనూ సాధించడానికి ఎంతో ప్రతిభా, కషీ అవసరమన్నారు. పత్రికల భాషకీ, కవిత్వ భాషకీ చాలా తేడా ఉంటుందన్నారు. ఫాసిస్టు విధానాలపై నిరసనను వ్యక్తం చేసే కవిత్వం-అంబపలుకు అన్నారు. అధ్యక్షత వహించిన బండ్ల మాధవరావు మాట్లాడుతూ రచయిత శ్రీనివాస్ గౌడ్ సాహితీరంగంలో వేగంగా ఎదుగుతూ, తనదైన గుర్తింపు సాధిస్తున్నారని చెప్పారు. వివిధ ప్రపంచ భాషల కవిత్వాన్ని తెలుగులోకి తేవడంలో ఆయన కషి ప్రశంసనీయమైనదన్నారు. కవితా రచన, కథా రచన, సాహితీ విమర్శ, కవితానువాదం తదితర రంగాలలో శ్రీనివాస గౌడ్ కషి ఎన్నదగినదన్నారు. డాక్టర్ సుంకర గోపాల్ పుస్తకాన్ని సమీక్ష చేస్తూ సమాజంలోని ఎనిమిది కీలకాంశాలపై శ్రీనివాస్ గౌడ్ ప్రభావవంతంగా కవితలను సజించారన్నారు. కవిత మొదటి పదం నుంచీ చివరి వరకూ స్థిరమైన ఆలోచనాధారను వెలువరించడంలో కవి విజయవంత మయ్యారని వివరించారు. యాకూబ్, సత్యాజీ, శాంతిశ్రీ, పద్మకళ, కలిమిశ్రీ, పి. శ్రీనివాస్ గౌడ్ సభలో పాల్గొని ప్రసంగించారు.

ప్రజా రచయిత శారద

అరసం అధ్యక్షులు పెనుగొండ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రజల్లో జీవించి, ప్రజల కష్టాలు ప్రతిఫలించేలా ప్రజల కోసం రచనలు చేసిన గొప్ప రచయిత నటరాజన్ అని అరసం అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. నగరంలోని ఐజిఎంసి స్టేడియంలో జరుగుతున్న 35వ పుస్తక మహోత్సవం ఎనిమిదో రోజు బుధవారం రామోజీరావు సాహిత్యవేదికపై రెండో కార్యక్రమంగా నిర్వహించిన 'శారద' కలం పేరుతో గుర్తింపు పొందిన కథారచయిత 'సుబ్రహ్మణ్యన్ నటరాజన్' శతజయంతి సభను నిర్వహించారు. ఈసందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తనదైన శైలితో, వ్యక్తీకరణతో సామాజిక స్పృహను కనబరుస్తూ పాఠకుల హృదయాల్లో నిలిచిపోయిన రచయిత నటరాజన్ అని చెప్పారు. ప్రముఖ రచయితగా గుర్తింపు పొందినప్పటికీ దుర్భర దారిద్ర్యాన్ని గడపాల్సి వచ్చిందన్నారు. ఆయన రచనలను ప్రచురించిన పత్రికలు కూడా ఆయనను మోసం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమిళు డైనా, తెలుగు ప్రాంతంలో హోటల్ సర్వర్‌గా జీవితాన్ని ప్రారంభించి, తనకున్న పఠనాసక్తితో అనతికాలంలో గుర్తింపు పొందిన రచయితగా మారారన్నారు. శరత్‌చంద్ర జ్యోతిశ్రీ సభకు అధ్యక్షత వహించారు. గోళ్ల నారాయణరావు, విశాలాంధ్ర మనోహర్ నాయుడు సభలో పాల్గొని ప్రసంగించారు.

మాట్లాడుతున్న పెనుగొండ లక్ష్మీనారాయణ

పుస్తక మహోత్సవంలో నేడు...

జనవరి 9 గురువారం

సాయంత్రం 6 గంటలకు : గ్రంథాలయ పునర్వికాసంపై సదస్సు, సభలో మండలి బుద్ధ ప్రసాద్, మనసు ఫౌండేషన్ మన్యం రాయుడు, వల్లూరి శివప్రసాద్, దేవినేని మధుసూదనరావు పాల్గొంటారు.

సాయంత్రం 7:30గంటలకు : విశాలాంధ్ర వారి 'విశ్వం' పుస్తకావిష్కరణ సభ

రతన్ టాటా పిల్లల ప్రతిభావేదిక మీద

సాయంత్రం 5 నుండి 6 గంటల వరకు : శాస్త్రజ్ఞుల జీవిత చరిత్రలపై విద్యార్థుల ఉపన్యాసాలు

సాయంత్రం 6 నుండి 8:30 గంటల - వరకు : క్విజ్

ప్రకృతి వ్యవసాయం పుస్తకావిష్కరణలో అప్పాజీ, అమరయ్య, సతీష్, పాషా

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : తినే ఆహారం కూడా రసాయనాలతో విషపూరితమైపోతున్న ఈ రోజుల్లో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రచారం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ది హిందూ రెసిడెంట్ ఎడిటర్ అప్పాజీ అన్నారు. ప్రకృతి వ్యవసాయం మీద ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి పెరుగుతున్న తరుణంలో మన ప్రాచీన విధానాలను పరిరక్షించుకోవాలన్నారు. 35వ పుస్తక మహోత్సవం ఎనిమిదో రోజు బుధవారం రామోజీరావు సాహిత్యవేదికపై నిర్వహించిన మూడో కార్యక్రమంగా వాచకం ప్రచురణలకు చెందిన 'ప్రకృతి వ్యవసాయం - పాలేకర్ విధానం' పుస్తకాన్ని పాత్రికేయ వృత్తి మిత్రులు ఆవిష్కరించారు. ఆకుల అమరయ్య, రఘురామయ్య, చిగురుపాటి సతీష్, అక్బర్ పాషా తదితర పాత్రికేయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అమరావతి కేపిటల్ చైర్మన్‌గా రంగనాథ్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బాయ్) అమరావతి క్యాపిటల్ సెంటర్ ఛైర్మన్‌గా గుడివాడ అమ్మకన్‌స్ట్రక్షన్స్ అధినేత మాటూరి రంగనాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.నాగమల్లేశ్వరరావు ప్రకటించారు. విజయవాడ వేదికగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. అమరావతి క్యాపిటల్ విభాగం ప్రధాన కార్యదర్శిగా ఎస్ సత్యన్నారాయణ, కోశాధికారిగా కెపి కిరణ్, ఉపాధ్యక్షులుగా పట్నాయక్, రాజేష్, సంయుక్త కార్యదర్శిగా వి.వెంకట నారాయణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన ఛైర్మన్ మాటూరి రంగనాథ్ మాట్లాడారు. అనంతరం నూతన సంవత్సరం డైరీని ఇరవై సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ ఆవిష్కరించారు.

కేరళ చేతిలో ఓటమి

సెమీ ఫైనల్స్‌కు కేరళ, తమిళనాడు, హర్యానా జట్లు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడలోని పిబి సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ జూనియర్ కళాశాలలో జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్-19 బాలికల జాతీయ వాలీబాల్ టోర్నీ క్వార్టర్ ఫైనల్స్‌లో ఆంధ్రప్రదేశ్‌కు కేరళ జట్టు షాకిచ్చింది. ఎపి జట్టు కేరళపై వరుస సెట్ల తేడాతో ఓటమిని చవిచూసి, సెమీఫైనల్‌కు చేరుకోవాలనే ఆశలకు అడియాశలు చేసుకుంది. కేరళ, ఆంధ్రప్రదేశ్ మధ్య జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో కేరళ 3-0 (25-23, 25-20, 26-16)తో విజయం సాధించింది. తొలి సెట్‌లో గట్టి పోటీ ఎదురైనప్పటికీ, ఆంధ్రప్రదేశ్ వారి జోరును సద్వినియోగం చేసుకోలేకపోయింది, తరువాతి సెట్‌లలో కేరళ ఆధిపత్యాన్ని కొనసాగించింది సెమీస్‌లో చోటు దక్కించుకుంది. తమిళనాడు, పశ్చిమ బెంగాల్ మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో తమిళనాడు 3-1 (25-23, 25-15, 16-25, 25-14)తో విజయం సాధించింది. మూడో సెట్‌ను కోల్పోయిన తమిళనాడు పుంజుకుని విజయాన్ని అందుకోవడం ద్వారా సెమీస్‌కు చేరుకుంది. కాగా, హర్యానా - ఉత్తరప్రదేశ్ మధ్య జరిగిన మూడో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో, హర్యానా 3-0 (25-12, 25-23, 25-14) విజయంతో ఆధిపత్యం చెలాయించి సెమీ ఫైనల్స్‌లో ప్రవేశించింది. అంతకుముందు, ప్రీ-క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో, ఆంధ్రప్రదేశ్ ఢిల్లీ, తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, హర్యానా, ఉత్తరప్రదేశ్, పంజాబ్, కర్ణాటక జట్లు తమ ప్రత్యర్థులను ఓడించి క్వార్టర్-ఫైనల్‌కు చేరుకున్నాయి. పోటీల్లో భాగంగా గురువారం సెమీ ఫైనల్స్, శుక్రవారం ఫైనల్స్ జరగనున్నాయి.

శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దేవస్థానానికి ప్రతిరోజూ వేల సంఖ్యలో యాత్రికులు దర్శనార్థం వస్తున్నారు. వీరికి ఆహ్లాదకరమైన వాతావరణంలో దర్శనం కల్పించేందుకు నూతన ఇఒ కె.రామచంద్రమోహన్ దేవస్థానంలో శానిటేషన్ నిర్వహణను మెరుగుపరిచేందుకు బుధవారం ప్రత్యేక దృష్టి సారించారు. కొండపైన, కింద క్యూలైన్‌లు, ప్రధాన దేవాలయం, శ్రీ మల్లేశ్వర స్వామి ఆలయం, ఉప ఆలయాలు, అన్నదాన విభాగం, పార్కింగ్ ప్రదేశాలు, ఘాట్ రోడ్, టాయిలెట్‌లు, ఆఫీస్‌లోని అన్ని విభాగాలు, క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పారిశుధ్యం పూర్తి సంతృప్తికరంగా లేకపోవటం గమనించి, శానిటేషన్ నిర్వహణ పట్ల పలు సూచనలు చేశారు పలు ప్రదేశాలలో ఉన్న పాత, వ్రేలాడుచున్న, నిరూపయోగమైన వైర్లు, ఉపయోగంలో లేని వస్తువులు మరియు చెత్త తొలగించడం, టాయిలెట్ల మరమ్మతులు తదితర చర్యలు చేపట్టారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.